

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
చిత్తూరు జిల్లా వార్తలు
శుక్రవారం 9 ఫిబ్రవరి 2024





'ఆరణి'కి మొండిచేయి

● రాజ్యసభకు పంపిస్తామని మాట తప్పిన వైసీపీ ● తీవ్ర అసంతృప్తిలో బలిజ సామాజికవర్గం ● చిత్తూరు ఎమ్మెల్యే భవిష్యత్తుపై చర్చ

చిత్తూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులకు వైసీపీ అధిష్ఠానం మొండిచేయి ఇచ్చింది. వచ్చే ఎన్నికల్లో ఆరణికి కాకుండా విజయానందరెడ్డికి అవకాశం ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆరణిని, బలిజ సామాజికవర్గాన్ని దూరం చేసుకోకూడదనే ఉద్దేశంతో రాజ్యసభకు పంపిస్తామని అధిష్ఠానం హామీ ఇచ్చింది. దీంతో తనకు టికెట్ రాకపోయినా మిగిలినవారిలా ఆయన అసమ్మతి రాగం వినిపించలేదు. తీరా వైసీపీ గురువారం విడుదల చేసిన రాజ్యసభ అభ్యర్థుల జాబితాలో ఆరణి శ్రీనివాసులుకు చోటు లేకుండా పోయింది. దీంతో ఎమ్మెల్యేతో పాటు బలిజ సామాజికవర్గం తీవ్ర అసంతృప్తిలో ఉన్నట్లు తెలుస్తోంది. మాట తప్పను, మడమ తిప్పను అని చెప్పుకొనే సీఎం జగన్.. చిత్తూరు ఎమ్మెల్యేకు మాత్రం అన్యాయం చేశాడని జిల్లా వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఇక ఆరణి రాజకీయ భవిష్యత్తు ఏంటి? ఆయన అడుగులు ఎటువైపు అనేది ఆసక్తికరంగా మారింది.

ఆరణి శ్రీనివాసులు టీడీపీ, ప్రజారాజ్యం పార్టీల్లో జిల్లా అధ్యక్షుడిగా పనిచేసి, వైసీపీలోకి చేరారు. 2019 ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన గెలిచినప్పటి నుంచీ మిగిలిన ఎమ్మెల్యేల తరహాలో పూర్తి స్వేచ్ఛ లేకుండా పోయింది. సొంత పార్టీ నాయకుడు విజయానందరెడ్డి బలమైన వ్యతిరేకవర్గంగా మారారు. అనేక సందర్భాల్లో ఎమ్మెల్యే కంటే విజయానందరెడ్డి మాటే చెల్లుబాటుఅయ్యేది. నియోజకవర్గంలో వ్యతిరేకవర్గం గట్టిగా ఉన్నా వచ్చే ఎన్నికల్లో జగన్ మరో అవకాశం ఇస్తారని ఎమ్మెల్యే ధీమాగా ఉన్నారు. కానీ, ఊహించని విధంగా వైసీపీ అధిష్ఠానం ఆరణిని పక్కన పెట్టేసి విజయానందరెడ్డికి అవకాశం కల్పించింది. రెండుసార్లు జగన్ ఆరణితో సమావేశమై రాజ్యసభకు పంపిస్తామని హామీ ఇచ్చినా.. ఆచరణలో మడమ తిప్పేశారు.

ఆరణి నిర్ణయమేంటి?



విజయానందరెడ్డి పేరు ప్రకటించినప్పటి నుంచి గెలిచేందుకు క్షేత్రస్థాయిలో గట్టిగా పనిచేసుకుంటూ పోతున్నారు. ఓసారి ఎమ్మెల్యేతో భేటీ అయి ఆయన మద్దతు కూడా కోరారు. ఆరణికు ఎంపీ సీటు ఆఫర్ చేసిన నేపథ్యంలో ఆయన విజయానందరెడ్డి గెలుపునకు కృషి చేస్తారని వైసీపీ శ్రేణులు భావించారు. తీరా ఇప్పుడు అధిష్ఠానం మొండిచేయి ఇవ్వడంతో ఆరణి నిర్ణయంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. ఆయన వైసీపీలోనే ఉంటూ విజయానందరెడ్డి గెలుపునకు సహకరిస్తారా? లేదా వేరే పార్టీలోకి వెళ్లి మళ్లీ ఎమ్మెల్యేగా పోటీ చేస్తారా? లేదా ఈ ఎన్నికలను పట్టించుకోకుండా ఊరుకుండిపోతారా? అని ఇప్పుడు చిత్తూరులో చర్చ జరుగుతోంది. సమీకరణాల కారణంగా ఇప్పుడు రాజ్యసభ అవకాశం ఇవ్వలేకపోతున్నామని.. 2026లో కచ్చితంగా అవకాశం కల్పిస్తామని వైసీపీ పెద్దలు ఎమ్మెల్యేకు చెప్పినట్లు ప్రచారం జరుగుతోంది. కానీ, ఆ హామీని ఎమ్మెల్యే, ఆయన అనుచరులు నమ్మే పరిస్థితిలో లేరు.

ఉమ్మడి జిల్లాలో 9 మంది రెడ్లే

చిత్తూరు ఉమ్మడి జిల్లాలో 14 నియోజకవర్గాలుండగా, అందులో 9 చోట్ల రెడ్లు ఉన్నారు. పుంగనూరు, పలమనేరు, చిత్తూరు, తంబళ్లపల్లె, పీలేరు, తిరుపతి, చంద్రగిరి, నగరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల్లో ప్రస్తుతానికి వైసీపీ అభ్యర్థులు రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారే. పూతలపట్టు, సత్యవేడు, జీడీనెల్లూరు నియోజకవర్గాలు రిజర్వు కాకపోయి ఉంటే అక్కడా రెడ్లకే అవకాశం ఇచ్చేవారని ప్రజలు సెటైర్లు వేసుకుంటున్నారు.

కాపు ఓట్లను వద్దనుకుంటోందా..?

రాయలసీమ నాలుగు ఉమ్మడి జిల్లాలతో పాటు నెల్లూరు, ఒంగోలు జిల్లాల్లో ఇప్పుడు ఎక్కడా వైసీపీ అభ్యర్థులు బలిజ సామాజికవర్గానికి చెందినవారు లేరు. చిత్తూరులో ఆరణి శ్రీనివాసులును కాదని, విజయానందరెడ్డికి అవకాశం ఇచ్చారు. అలాగే ఒంగోలు జిల్లాలోని దర్శి నియోజకవర్గంలో మద్దిశెట్టి వేణుగోపాల్‌ను కాదని బూచేపల్లె శివప్రసాద్‌రెడ్డికి అవకాశం ఇచ్చారు. ఈ ఆరు ఉమ్మడి జిల్లాల్లో ఉన్న ఇద్దరు బలిజ ఎమ్మెల్యేలను కాదని వైసీపీ అధిష్ఠానం రెడ్డి సామాజికవర్గానికి టికెట్లను ఇచ్చింది. కాపు ఓట్లు తమకు వద్దనే ధోరణితో వైసీపీ ఉందని ఆ సామాజికవర్గం భావిస్తోంది.

ఎండ మండుతోంది

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 8: జిల్లాలో అప్పుడే ఎండలు మండుతున్నాయి. చిత్తూరులో నమోదవుతున్న పగటి ఉష్ణోగ్రతతో నగరవాసులు భయపడిపోతున్నారు. మార్చినెల రాకముందే ఎండలు ఇంత తీవ్రంగా ఉంటే.. ఏప్రిల్, మే నెలల్లో పరిస్థితులు ఎలా ఉంటాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో మధ్యాహ్నంవేళ వేడిగాలుల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. దీతో విద్యుత్ వినియోగమూ పెరుగుతోంది. చిత్తూరులో బుధవారం పగటి ఉష్ణోగ్రత 34.18 డిగ్రీలు, గురువారం 34.19 డిగ్రీలు నమోదయ్యాయి.

పుంగనూరులో మట్టి దోపిడీ





బోడేవారిపల్లె వద్ద సుబ్బారెడ్డి చెరువును తవ్వేస్తున్నారిలా..

ఒకవైపు ఎక్స్‌కవేటర్లతో తవ్వకాలు. మరోవైపు టిప్పర్లు, ట్రాక్టర్లలో మట్టి తరలింపు. ఇలా చెరువులను ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. మట్టి దోపిడీకి పాల్పడుతున్నారు. మట్టి మాఫియా చర్యలతో చెరువులు గుంతలమయంగా మారి.. రూపురేఖలు కోల్పోతున్నాయి.

\- పుంగనూరు

● చెరువుల్లో ఎటు చూసినా టిప్పర్లు, ట్రాక్టర్లే ● యంత్రాలతో విచ్చల విడిగా తవ్వేస్తున్న వైనం ● నిద్ర నటిస్తున్న అధికారులు

ప్రకృతి సంపదైన కొండలు, గుట్టలు.. మరోవైపు చెరువుల్లో విచ్చలవిడిగా మట్టి తరలిస్తున్నా పట్టించుకునే వారు లేకుండా పోయారు. పుంగనూరులో అక్రమంగా మట్టి, ఇసుకను తరలించే టిప్పర్లు, ట్రాక్టర్లను ఆపి ప్రశ్నించడం, తనిఖీలు చేసి జరిమానా వేయడం, నివారణ చర్యలు తీసుకునే సాహసం చేసేందుకు అధికారులకు ధైర్యం చాలడంలేదు. ఎందుకంటే.. అక్రమార్కులకు అధికార పార్టీ అండ ఉండటమే. వైసీపీలోని కొందరు మట్టి, ఇసుకను ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్నారన్న ఆరోపణలున్నాయి. అధికారులూ పట్టించుకోకపోవడంతో రాత్రింబవళ్లు మట్టి తరలిస్తున్నారు. ఇలా తరలిస్తున్న మట్టిని రియల్‌ఎస్టేట్ వ్యాపారులు ప్లాట్ల తయారీకి వినియోగిస్తున్నారు. ఇటీవల జిల్లాలో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వ అనుమతులు ఏమీలేకుండా విచ్చలవిడిగా లేఅవుట్లు వెలుస్తున్నాయి. వ్యవసాయ భూముల్లో అనుమతులు లేకపోయినా అడిగేవారు లేకపోవడంతో ఇష్టం వచ్చినట్లు వివిధ ప్రాంతాల నుంచి భారీగా మట్టిని తీసుకువచ్చి వెంచర్లు తయారు చేస్తున్నారు. అధికంగా అధికారపార్టీ వైసీపీ ముఖ్యులు ఉండటంతో అధికారులు పుంగనూరులో మట్టి తరలింపును అరికట్టడంతో చేతులెత్తేశారనే విమర్శలున్నాయి. దీంతో ఎక్స్‌కవేటర్లు, హిటాచీలతో మట్టి తవ్వకాలతో చెరువులు పెద్దపెద్ద గోతులతో రూపురేఖలు మారిపోతున్నాయి. టిప్పర్ల రాకపోకలతో పలు రోడ్లు నాశనమవుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పుంగనూరులో మట్టి అక్రమరవాణాను అరికట్టి చెరువులను కాపాడాలని రైతులు కోరుతున్నారు.



కొండసముద్రం చెరువులో టిప్పర్లకు మట్టి లోడ్ చేస్తున్న యంత్రాలు

వాళ్ల దృష్టికి వచ్చేది ఎప్పుడో మరి!

'మట్టి తవ్వకం విషయం మా దృష్టికి రాలేదు. అయినా సిబ్బందిని పంపి విచారిస్తాం. తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. ఎవరైనా అలా తవ్వితే చర్యలు తీసుకుంటాం'... ఇదీ మట్టి అక్రమ రవాణాపై ఎప్పుడు అడిగినా అధికారులు చెప్పేమాట. ఇప్పటి వరకు వీరు విచారించి నిర్ధారించింది లేదు. చర్యలు తీసుకుందీ లేదు. అందుకే చెరువుల్లో నుంచి మట్టి అక్రమంగా తరలిపోతూనే ఉంది.

- పుంగనూరు సమీపంలోని కపాడమిట్టపల్లె చెరువులో యంత్రాలతో మట్టిని తవ్వి ట్రాక్టర్లు, టిప్పర్లతో నిరాటంకంగా తరలిస్తున్నారు. మట్టి తవ్వకాలతో పిచ్చిగుంట్లపల్లె సమీపంలోని కొండసముద్రం చెరువు గోతులమయంగా మారింది.
- ఈడిగపల్లె దర్గా వెనుకగల బోడేవారిపల్లె వద్ద గల సుబ్బారెడ్డి చెరువు నుంచి భారీగా మట్టి, ఇసుకను మదనపల్లె, ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు.
- పుంగనూరు బైపాస్‌రోడ్డులో తీగలమ్మ చెరువులో మట్టి తవ్వేస్తున్నారు. దీంతో ఆ చెరువు లోయను తలపిస్తోంది.



మట్టి తరలింపుతో గోతులమయంగా మారిన కపాడమిట్టపల్లె చెరువు

డీఈవోగా దేవరాజు బాధ్యతల స్వీకరణ



చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 8: జిల్లా విద్యాశాఖ అధికారిగా సి.దేవరాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. కడప జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టరుగా పనిచేస్తున్న ఈయన్ను పదోన్నతిపై డీఈవోగా ప్రభుత్వం బదిలీ చేసింది. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏడీ1తో పాటు డీఈవోగా పనిచేసిన విజయేంద్రరావు.. ఇక ఏడీ1కి పరిమితం కానున్నారు. నూతన డీఈవోను కార్యాలయ సిబ్బందితో పాటు పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు కలిసి అభినందనలు తెలిపారు.

ఆటో నడుపుతుండగా గుండెపోటు

● రోడ్డుపక్కన ఆపి హ్యాండిల్‌పైనే కుప్పకూలి కన్నుమూసిన రెడ్డెప్ప



రెడ్డెప్ప(ఫైల్‌ఫొటో)

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 8: ప్రయాణికులతో ఆటో బయలదేరింది. మార్గమధ్యంలో ఛాతీనొప్పితో డ్రైవరు ఇబ్బంది పడ్డారు. వెంటనే రోడ్డుపక్కన ఆటో ఆపారు. ఆ వెంటనే హ్యాండిల్‌పై తల వాల్చిన ఆయన కన్నుమూశారు. ఒకవేళ ఆటో ఆపకుండా ఉండుంటే ఏదేని ప్రమాదం జరిగుంటే తాము ఇబ్బంది పడుండేవాళ్లమంటూ ప్రయాణికులు డ్రైవరు రెడ్డెప్ప చొరవను గుర్తుచేసుకుంటున్నారు. ఈ ఘటన గురువారం బైరెడ్డిపల్లెలో చోటుచేసుకుంది. బైరెడ్డిపల్లెకు చెందిన రెడ్డెప్ప(56) ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నారు. ఎప్పటిలాగే గురువారం ఆయన బైరెడ్డిపల్లెలో ఎనిమిది మంది ప్రయాణికులను ఎక్కించుకుని బయలుదేరారు. నాలుగురోడ్ల సమీపంలో అతడికి గుండెనొప్పి రావడంతో ఆటోను రోడ్డుపక్కన ఆపి హ్యాండిల్‌పైనే కుప్పకూలిపోయారు. గమనించిన ప్రయాణికులు స్థానికుల సహకారంతో బైరెడ్డిపల్లె ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గుండెపోటు వచ్చినా ఆటోను పక్కకుపెట్టి ప్రమాదం జరగకుండా ప్రయాణికులను సురక్షితంగా కాపాడి కన్నుమూసిన రెడ్డెప్పకు.. ఆటోడ్రైవర్ల సంఘం సభ్యులు సంతాపం తెలిపారు. ప్రభుత్వం ద్వారా మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందించాలని అధికారులకు విన్నవించారు.

కమ్మీతో బెలూన్ తీస్తూ..!



రంజిత్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

● కరెంటు తీగలకు తగలడంతో బాలుడి దుర్మరణం

గంగవరం, ఫిబ్రవరి 8: ఆటలాడుతున్న బెలూన్.. పక్కన పడిపోయింది. దీనిని కమ్మీతో తీసేందుకు ప్రయత్నిస్తూ.. కరెంటు తీగలకు ఆ కమ్మీ తగలడంతో షాక్‌కు గురై మృతిచెందాడు 8ఏళ్ల బాలుడు.ఈ విషాద ఘటన గంగవరం మండలంలో చోటుచేసుకుంది. సీఐ చిన్నగోవిందు తెలిపిన ప్రకారం.. గండ్రాజుపల్లె పంచాయతీ అనంతపురం గ్రామానికి చెందిన బి.జయరామ్, గాయత్రి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రంజిత్‌కుమార్ గండ్రాజుపల్లెలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్నాడు. బుధవారం సాయంత్రం బడి నుంచి ఇంటికి వచ్చిన బాలుడు.. బెలూన్‌ను చేతపట్టుకొని మిద్దెపైకి వెళ్లాడు. బెలూన్‌తో ఆడుతుండగా గాలికి ఎగిరి మిద్దె పక్కనే ఉన్న రేకులషెడ్‌పై పడిపోయింది. కిందికి దిగివచ్చి ఇనుప కమ్మీని తీసుకుని రేకులషెడ్‌పై పడివున్న బెలూన్‌ను తీయడానికి ప్రయత్నించాడు. ఈ క్రమంలో కమ్మీని పైకి ఎత్తగానే, అక్కడున్న 11 కేవీ కరెంటు తీగకు తగిలింది. దీంతో విద్యుదాఘాతానికి గురై పడిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన బాలుడిని చికిత్స నిమిత్తం బెంగళూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. బాలుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఆమె తిట్లపురాణం వినలేకున్నాం

● విద్యార్థినుల నిరసన.. మహిళా టీచరుపై డిప్యూటీ కలెక్టర్‌కు ఫిర్యాదు



డిప్యూటీ కలెక్టర్ వెంకటశివకు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థినులు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 8: గంగాధర నెల్లూరు ఉన్నత పాఠశాలలోని మహిళా టీచర్ తిట్ల పురాణాన్ని వినలేకపోతున్నామని పలువురు విద్యార్థులు గురువారం నిరసనకు దిగారు. అసభ్యపదజాలంతో మాట్లాడుతున్నారంటూ ఆవేదన వ్యక్తంచేశారు. దీనిపై అందిన ఫిర్యాదులతో విచారణకు వచ్చిన అధికారులనూ ఆమె దూషిస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. గురువారం కూడా విద్యార్థినులను ఆ మహిళా టీచరు అసభ్యకరంగా దూషించడాన్ని నిరసిస్తూ హైస్కూల్ ఆవరణలో నిరసన తెలిపారు. అదే సమయానికి హైస్కూల్లో పోలింగ్‌కేంద్రాలను తనిఖీచేయడానికి డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ వచ్చారు. దీంతో ఆయనకు విద్యార్థినులు ఫిర్యాదు చేశారు. ఆ టీచర్‌ను బదిలీచేయాలని కోరారు. ఆ మహిళా టీచరును డిప్యూటీ కలెక్టర్ పిలిపించి మాట్లాడగా, మధ్యాహ్న భోజనం విషయంగా జరుగుతున్న అన్యాయాన్ని నిలదీస్తే తనపై లేనిపోని మాటలు చెప్పి అసత్యప్రచారం చేస్తున్నారని ఆమె చెప్పారు. దీంతో ఆయన డీఈవోకి ఫోనుచేసి.. రెండురోజుల్లోపే హైస్కూల్‌ని తనిఖీ చేసి, అక్కడి సమస్యను పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ రవి, డీటీ తులసీరామ్, ఎలక్షన్ డీటీ విజయకృష్ణ తదితరులున్నారు.

అడవికి నిప్పు



శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 8: ఎస్ఆర్‌పురం సమీపంలోని అడవికి గుర్తు తెలియని వ్యక్తులు గురువారం నిప్పుపెట్టారు. ఆకతాయిల చర్యతో అడవిలో ఉండే జీవరాశులు, చెట్లు కాలి బూడిదయ్యాయి. అయినప్పటికీ అటవీశాఖ అధికారులు పట్టించుకోలేదు. ఇప్పటికైనా అటవీశాఖ అధికారులు అడవికి నిప్పు పెట్టేవారిపై నిఘా పెట్టి తగినచర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రేషన్ పర్యవేక్షణకు రూ.750 ఏదీ?

● వలంటీర్లకు జీతంతో పాటు జమకాని అదనపు ప్రోత్సాహం

● జిల్లాకు రూ.60 లక్షలు ఎప్పుడిస్తారో మరి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 8: రేషన్ పంపిణీని పర్యవేక్షించే వలంటీర్లకు రూ.750 ప్రోత్సాహాన్ని అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు గత నెలలో 15రోజుల పాటు ఎండీయూ వాహనాలవెంట వలంటీర్లు వెళ్లారు. వీరికి ఈనెలలో జనవరి నెల జీతం తప్ప ప్రభుత్వం ఇస్తామన్న రూ.750 అదనపు ప్రోత్సాహకాలు ఖాతాల్లో జమ కాలేదు. ప్రభుత్వ వైఖరిని గమనిస్తున్న వీరు.. ఈ నగదు ఎప్పుడిస్తారోనని ఆందోళన చెందుతున్నారు. జిల్లావ్యాప్తంగా 5.41 లక్షల రేషన్ కార్డుదారులకు.. 336 ఎండీయూ (మొబైల్ డిస్పెన్సరీ యూనిట్) వాహనాల ద్వారా సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రమంలో రేషన్ పంపిణీలో వలంటీర్లను భాగస్వాములను చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీనికోసం నెలకు రూ.750 అదనపు ప్రోత్సాహాన్ని అందిస్తామని చెప్పింది. ఆ ప్రకారం వలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలో ఇంటింటికీ రేషన్ పంపిణీలో అనుసంధాన కర్తలుగా జనవరి నుంచి వ్యవహరిస్తున్నారు. జిల్లాలోని దాదాపు 8200 మంది వలంటీర్లు జనవరిలో 1-17వ తేదీల మధ్య రేషన్ పంపిణీలో పర్యవేక్షణ ప్రక్రియతో పాటు పీవోఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) మిషన్ ఆపరేటింగ్ చేశారు. దీనికిగాను ఒక్కొక్కరికి రూ.750 చొప్పున 8200 మందికి సుమారు రూ.60 లక్షలు చెల్లించాల్సి ఉంది. కాగా ఫిబ్రవరి నెలలో వలంటీర్లకు రూ.5వేల గౌరవ వేతనం తప్ప రూ.750 అదనపు పారితోషికం వారి బ్యాంకు ఖాతాల్లో జమకాలేదు. ఈ విషయమై సచివాలయ అధికారులను అడగ్గా.. ఈ చెల్లింపులు తమ పరిధిలోది కాదని, పౌసరఫరాల శాఖ అధికారులదేనన్నారు. డీఎస్వో శంకరన్‌ను వివరణ కోరగా.. రాష్ట్రస్థాయిలో నిధుల చెల్లింపులు చేస్తారని, ఆ మొత్తాలను ఎప్పుడు చెల్లిస్తారో తనకు తెలియదని చెప్పారు.

బుగ్గన బడ్జెట్ అంతా అంకెల గారడీనే: అమర్



పలమనేరు, ఫిబ్రవరి 8: రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతే అంకెల గారడీనే అని మాజీ మంత్రి అమరనాథరెడ్డి గురువారం విమర్శించారు. రూ.13వేల కోట్లు రెవెన్యూ లోటును రూ.44 వేల కోట్లకు, రూ. 35వేల కోట్ల ద్రవ్యలోటును రూ. 60 వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనకే దక్కుతుందన్నారు. పన్నుల బాదుడు తప్ప కొత్త అంశాలు ఏవీలేవన్నారు. వైసీపీ హయాంలో ధరలపెంపు, పన్నుల భారం ప్రజలపై మోపిందన్నారు. రిజిస్ట్రేషన్, విద్యుత్ చార్జీలు భారీగా పెంచిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. మద్యం మీద వచ్చే డబ్బుతో జగన్ సర్కార్ నడుస్తోందన్నారు. ఆరోగ్యశ్రీకి బడ్జెట్‌లో నిధులు అంతంత మాత్రమే ఇవ్వడం, తల్లీ బిడ్డ ఎక్స్‌ప్రెస్ రద్దుచేయడాన్ని చూస్తుంటే ఈ ప్రభుత్వ చిత్తశుద్ధి అర్థమవుతుందన్నారు. 35లక్షల పొదుపు గ్రూపులకు బడ్జెట్‌లో మొండిచెయ్యి చూపారని, రైతు భరోసా ద్వారా లబ్ధిదారుల సంఖ్యను భారీగా తగ్గించేశారని ఆరోపించారు.

వైసీపీ పాలనలో అప్పులు రెట్టింపు: టీడీపీ



టీడీపీ నేతలతో కలిసి మాట్లాడుతున్న దొరబాబు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 8: బుగ్గన బడ్జెట్ అంతా అంకెల మాయగా ఉందని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు విమర్శించారు. చిత్తూరులోని జిల్లా టీడీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బడ్జెట్‌లో అంచనాలు కొండంత, ఖర్చులు పిసరంత ఉన్నాయని చెప్పారు. పన్నుల బాదుడు తప్ప కొత్త అంశాలు లేవన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఏపీ అప్పులు రెట్టింపు అయ్యాయని అన్నారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారని పేర్కొన్నారు. వైసీపీ హయాంలో తీసుకువచ్చిన ప్రతి స్కీము ఒక స్కామ్‌గా మారిందని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో భారం మోపడం, ధరల పెరుగుదల, రిజిస్ట్రేషన్ చార్జీలపెంపు, విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ సమావేశంలో నేతలు సురేంద్ర కుమార్, కోదండయాదవ్, చంద్రప్రకాష్, కాజూరు బాలాజీ, శంకర్, సీఆర్ రాజన్ తదితరులు పాల్గొన్నారు.

11న షర్మిల సభకు రండి

● పార్టీ శ్రేణులు, నేతలు, ప్రజలకు డీసీసీ అధ్యక్షుడి పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్

కార్వేటినగరం, ఫిబ్రవరి 8: నగరిలోని గడియారం సెంటర్ వద్ద ఈ నెల 11న జరిగే పీసీసీ అధ్యక్షురాలు షర్మిల రచ్చబండ సభకు పార్టీ.. అనుబంధ సంఘాల నేతలు, శ్రేణులు, ప్రజలు తరలిరావాలంటూ డీసీసీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ పిలుపునిచ్చారు. కార్వేటినగరంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ రోజు రేణిగుంట విమానాశ్రయం నుంచి పుత్తూరు మీదుగా నగరి ఓంశక్తి ఆలయం వరకు నిర్వహించే రోడ్‌షోలో షర్మిల పాల్గొంటారన్నారు. అక్కడ జరిగే బహిరంగ సభలో ప్రసంగిస్తారని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఈ సభకు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మీడియా అధికార ప్రతినిధి గోవర్ధన్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు కన్నన్ పాల్గొన్నారు.

పరిశోధనల్లో పరస్పర సహకారం

వర్క్‌షాప్‌లో ఐజర్ ప్రొఫెసర్ రామ్మూర్తి



మాట్లాడుతున్న ఐజర్ ప్రొఫెసర్ రామ్మూర్తి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 8: పరిశోధనల్లో మంచి ఫలితాలను సాధించడం కోసం ఆయా రంగాల్లో పనిచేస్తున్న వ్యక్తు లు, సంస్థల మధ్య పరస్పర సహకారం అవసరమని తిరుపతి ఐజర్ ప్రొఫెసర్ రామ్మూర్తి పేర్కొన్నారు. న్యూ హారిజన్స్ ఆఫ్ ఫ్లోరోసిస్ మైక్రోస్కోపీ టెక్నిక్ అంశంపై ఎస్వీయూ జువాలజీ విభాగంలో గురువారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పరస్పర సహకారంతో క్లిష్టమైన అంశాలను ఛేదించడానికి అవకాశం ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్ మాట్లాడుతూ పరిశోధనల్లో టెక్నాలజీని ఉపయోగించుకోవడం ద్వారా ఫలితాలను వేగంగా పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. ఐజర్ ప్రతినిధులు శివకుమార్, సుబ్రమణ్యం, శర్మ, ప్రిన్సిపాల్ రామకృష్ణారెడ్డి, హెడ్ కిషోర్, కన్వీనర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

16నుంచి వ్యవసాయ కాలేజీ కార్మికుల సమ్మె



కార్మికులతో మాట్లాడుతున్న వెంకటేష్

తిరుపతి(విద్య),ఫిబ్రవరి 8: తిరుపతిలోని వ్యవసాయ కళాశాలలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 16 నుంచి సమ్మెకు దిగుతున్నట్లు ఆల్ యూనివర్సిటీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి జి.నాగవెంకటేష్ తెలిపారు. కళాశాల ప్రాంగణంలో గురువారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ 22 సంవత్సరాలుగా పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, ప్రతినెలా జీతాలు, టైంస్కేల్ అమలు, ఈఎస్ఐ, పీఎఫ్, ప్రసూతి, ప్రభుత్వ సెలవులు అమలు చేయాలని కోరారు. సంఘ అధ్యక్షురాలు వరలక్ష్మి, కార్యదర్శి రాకేష్, సీఐటీయూ నాయకులు ముకేష్, చంద్రమ్మ, రమ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

యాత్రకు రండి బాబూ..రండి!

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 8: యాత్ర సినిమాను ఉచితంగా చూసేందుకు రండి బాబూ అంటూ అధికార పార్టీ నాయకులు జనం వెంట పడుతున్నారు. శ్రీకాళహస్తి పట్టణంలో గురువారం పాత్రికేయులకు యాత్ర-2 సినిమా టికెట్లను ఉచితంగా పంపిణీ చేశారు. రోజు మొత్తం ఆడిన నాలుగు ఆటల్లో వీలు పడినప్పుడు సినిమాను చూడవచ్చనే వెసులుబాటు కూడా కల్పించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన రెడ్డి ఇచ్చిన ఈ ఉచిత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సామాజిక మాధ్యమాల ద్వారా కోరడం చర్చనీయాంశంగా మారింది. ఇదే తరహాలో వైసీపీ కార్యకర్తలు ఉచితంగా సినిమాను వీక్షించేందుకు రావాలంటూ తెలిసిన వారి వెంట పడుతున్నట్టు సమాచారం.

పోలింగ్ కేంద్రాల్లో జాడలేని ఓటరు జాబితా

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 8: ఇప్పటికీ చిత్తూరు నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల తుది జాబితాను అందుబాటులో ఉంచలేదు. ఈ జాబితాలో ఏవైనా తప్పులుంటే.. ఓటర్లు పరిశీలించుకొని సవరణ చేసుకోవచ్చునని అధికారులు తెలిపారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో, చిత్తూరు ఆర్డీవో, తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయంలో జాబితాలను అందుబాటులో ఉంచుతామన్నారు. ఇప్పటి వరకు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితా లేదు. దీంతో ఓటరు జాబితాలో తమ ఓటు ఉందా, లేదా అని ఎలా పరిశీలించుకోవాలని ఓటర్లు ప్రశ్నిస్తున్నారు. జాబితాలో పేరు చూసుకునేందకుఉ ఆర్డీవో, మున్సిపల్ కార్యాలయాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. అక్కడ వందలాది పేజీలున్న జాబితాలో తమ పేర్లను ఎలా గుర్తించాలని ప్రశ్నిస్తున్నారు. జాబితాపై బీఎల్‌వోలను అడిగినా సమాధానం ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల జాబితాను ప్రచురించాలని కోరుతున్నారు.

● ఎల్‌బీ పురంలోని 96, బండపల్లిలోని 51వ పోలింగ్ కేంద్రంల్లో ఓటర్ల జాబితా జాడ లేదు. ఓటర్లు తమ ఓటు ఉందా లేదా అని తెలుసుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వచ్చి వెనుదిరుగుతున్నారు. కేంద్రంలో బీఎల్‌వోలు కూడా అందుబాటులో లేకపోవడంతో ఓటర్లు జాబితాలో తమ ఓటు ఉందా లేదా అని ఎలా తెలుసుకోవాలో పాలుపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● సత్యనారాయణపురంలోని 53, 114 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడా ఇదే పరిస్థితి. జాబితా విడుదల చేసిన తర్వాతి రోజున పోలింగ్ కేంద్రాల్లో ప్రచురించినట్లు ఫొటోలు దిగి వెళ్లిపోయారు. ఆ తర్వాత జాబితా కావాలంటే వారిని సంప్రదించాల్సిన పరిస్థితి నెలకొంది. వృద్ధ ఓటర్ల పరిస్థితి అయితే మరి దారుణంగా మారింది. చిత్తూరు నగరంలో, రూరల్ మండలంలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.

పోలింగ్ కేంద్రాలు మారినా...

గత ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. దీంతో పోలింగ్ కేంద్రాల నెంబర్లు మారాయి. ఇప్పటికే ఆ పోలింగ్ కేంద్రాల్లో పాత నెంబర్లే దర్శనమిస్తున్నాయి. దీంతో ఓటర్లు కూడా కన్ఫ్యూజ్ అవుతున్నారు. ఇప్పటికైనా పోలింగ్ కేంద్రాల నెంబర్లు మార్పు చేయాల్సి ఉంది.

నీళ్ల బిల్లులు రావాలంటే యుద్ధం చేయాల్సిందే

● సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నీటి సరఫరాదారుల వాయిస్ మెసేజ్

వి.కోట, ఫిబ్రవరి 8: గ్రామాల్లో నీటి సరఫరా చేసిన బిల్లులు వచ్చేట్లు లేవు. బిల్లులు రావాలంటే యుద్ధం చేయాల్సిందే అంటూ సోషల్ మీడియాలో వాయిస్ మెసేజ్ వైరల్ అవుతోంది. తన సహచర నీటి సరఫరాదారులను ఉద్దేశించి ఈ మెసేజ్ పెట్టారు. వైసీపీ అధికారంలోకి రాగానే.. కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో నీటి ఎద్దడి నివారణకు గ్రామాల్లో తాగునీటిని సరఫరా చేశారు. ఇప్పటి వరకు ఆ బిల్లులు రాకుండా ట్యాంకర్ల యజమానులు ఇబ్బంది పడుతున్నారు. వీరిలో వైసీపీకి చెందిన స్థానిక ప్రజాప్రతినిధులు, నేతలే ఎక్కువ. వీరందరికీ సుమారు రూ.20 కోట్ల మేరకు బిల్లుల బకాయి ఉంది. పలుమార్లు స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. పలుమార్లు విజయవాడ చేరుకుని అక్కడ ప్రభుత్వ పెద్దలతో చర్చించినా హామీలకే పరిమితమైంది. ఈ క్రమంలో రెండు వారాల కిందట కుప్పం పర్యటనకు వెళ్ళుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కాన్వాయ్‌కి వి.కోటలో అడ్డుపడి తమ సమస్య చెప్పారు. తిరుగు ప్రయాణంలో మంత్రి బాధితుల వద్ద ఉన్న బిల్లుల వివరాలను తీసుకున్నారు. త్వరలో బకాయిల విడుదలకు కృషి చేస్తానని చెప్పి వెళ్లారు. రోజులు గడుస్తున్నా బిల్లులు రాలేదు. ఈ క్రమంలో.. 'మన వాటర్ బిల్లులు గోవిందా.. గోవింద. మన బిల్లులు, ఎంబుక్‌లు విజయవాడ చేరాయి. ఏఈలు డబ్బులు తీసుకుని తప్పుగా రికార్డు చేశారని విజయవాడ ఈఎన్సీకి ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో విజిలెన్సుకు వేశారు. ఇక మన బిల్లులు రావు. బిల్లులు మరచిపోండి. బిల్లులు రావాలంటే యుద్ధం చేయాల్సిందే. ప్రతి ఒక్కరు రోడ్డు ఎక్కాల్సిందే' అంటూ వాయిస్ మెసేజీ వైరల్ అవుతోంది. అప్పులు చేసి నీళ్లు తోలితే బిల్లులు ఇవ్వకుండా తమను వేధిస్తున్నారంటూ అధికార పార్టీ వారే బాహాటంగా తమ ఆక్రోశాన్ని వెల్లగక్కుతున్నారు.

బదిలీలలు

తిరుపతి అర్బన్‌కు తహసీల్దార్‌ను రానీయకుండా రాజకీయ ఒత్తిళ్లు

డీటీకే పూర్తి బాధ్యతలు కట్టబెట్టే వ్యూహం

తిరుపతికి నియమించిన నాగేశ్వరరావు రేణిగుంటకు మార్పు


తిరుపతి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి అర్బన్ తహసీల్దార్‌గా పనిచేసేందుకు భయపడుతుండడం అటుంచితే, బాధ్యతలు తీసుకోనివ్వకుండా కూడా భయపెడుతున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన వెంకటరమణను కడప అర్బన్‌కు బదిలీ చేసి, కడప జిల్లా యర్రగుంట్ల తహసీల్దార్ నాగేశ్వరరావును ఇక్కడికి బదిలీ చేశారు. అయితే ఆయన బాధ్యతలు తీసుకునేందుకు వచ్చే క్రమంలో రాజకీయ ఒత్తిళ్లు వచ్చినట్టు తెలుస్తోంది. దీంతో ఆయన రేణిగుంట తహసీల్దార్‌గా గురువారం బాధ్యతలు స్వీకరించాల్సివచ్చింది. తిరుపతి అర్బన్‌లో డీటీగా ఉన్న అశోక్ రెడ్డి ప్రస్తుతం ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ఉన్నారు. ఆయనకే పూర్తి బాధ్యతలు అప్పగించేందుకు అధికార పార్టీ నేతలు వ్యూహం పన్నుతున్నారన్న విమర్శలున్నాయి. పదేళ్లకు పైగా అర్బన్ కార్యాలయంలో పనిచేస్తున్న ఈయన వ్యవహారశైలిపై విపక్షాలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నాయి. తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల్లో అవకతవకలు జరగడంలో ఆయన ప్రమేయం ఎక్కువగా ఉందని, అంతకుముందు 2019 సార్వత్రిక ఎన్నికల్లో పోస్టల్ బ్యాలెట్ అవకతవకలపై కూడా ఆయనపై ఆరోపణలున్నాయని విపక్షాలు అంటున్నాయి. తిరుపతి ఉప ఎన్నికకు సంబంధించి ఈఆర్వోగా పనిచేసిన అప్పటి మున్సిపల్ కమిషనర్ గిరీష, ఏఈఆర్వోగా పనిచేసిన తహసీల్దార్ జయరాములు సస్పెండైన విషయం తెలిసిందే. ఈక్రమంలో జరిగిన ఎన్నికల బదిలీలలో నాగేశ్వరరావును తిరుపతి అర్బన్ మండలానికి బాధ్యతలు తీసుకోనివ్వకుండా అడ్డుకున్నారని తెలుస్తోంది.దీంతో కడప జిల్లానుంచి బదిలీపై రేణిగుంటకు కేటాయించిన నారాయణ రెడ్డిని తిరుపతి అర్బన్‌కు మార్చారు.అయితే ఆయనను కూడా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నట్టు రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే అధికార పార్టీలోని ప్రధాన సామాజికవర్గానికి చెందిన వ్యక్తి కాబట్టి బాధ్యతలు తీసుకోవచ్చనే అభిప్రాయం కూడా వ్యక్తమవుతోంది. ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలోని స్ట్రాంగ్ రూమ్‌లు, ఈవీఎం యంత్రాల భద్రతకు సంబంధించిన వ్యవహారాలు చూసుకోవాల్సిన బాధ్యత తహసీల్దార్‌పైనే ఉంటుంది. తిరుపతి నియోజకవర్గానికి సంబంధించి ఈఆర్వోగా మున్సిపల్ కమిషనర్, ఏఈఆర్వోలుగా అర్బన్ తహసీల్దార్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్లు వ్యవహరిస్తారు. ఎన్నికల విధుల్లో మరో డిప్యూటీ తహసీల్దార్ ఉంటారు. ఆయనే ఏఈఆర్వోగా ఉంటే పారదర్శకంగా ఎన్నికలు ఎలా జరుగుతాయని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

పలువురు తహసీల్దార్లకు మళ్లీ బదిలీ

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 8: జిల్లాకు కొంతమంది తహసీల్దార్లుగా బదిలీపై వచ్చారు. అయితే తెరవెనుక ఏం జరిగిందో తెలియదు కానీ రెండు రోజుల వ్యవధిలో పలువురి స్థానాలు మారిపోయాయి.తిరుపతి అర్బన్ తహసీల్దారుగా నియమించిన బడిన నాగేశ్వరరావును రేణిగుంటకు,రేణిగుంటకు కేటాయించిన ఎంవీఎస్ నారాయణరెడ్డిని తిరుపతికి, బీఎన్‌కండ్రిగ తహసీల్దారుగా ఉన్న బాలకిషన్‌ను ఎర్రావారిపాళేనికి బదిలీ చేస్తూ కలెక్టర్ లక్ష్మీశ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న సయ్యద్ నౌషద్ అహ్మద్ గూడూరు ఆర్డీవో కార్యాలయ ఏవోగా, అక్కడ పనిచేస్తున్న ఆదిశేషయ్య సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయ ఏవోగా బదిలీ అయ్యారు. నాగలాపురం తహసీల్దారు ప్రసన్నకుమార్‌ను తిరుపతి ఆర్డీవో కార్యాలయ ఏవోగా నియమించారు. ఓజిలి తహసీల్దారు శివరామ సుబ్బయ్యను తొట్టంబేడుకు, గుంటూరు నుంచి వచ్చిన గోపాలకృష్ణన్‌ను సూళ్ళూరుపేటకు, అక్కడ పనిచేస్తున్న కల్యాణిని నాయుడుపేటకు తహసీల్దార్లుగా నియమించారు. నెల్లూరు నుంచి సయ్యద్ ఇక్బాల్ తడ తహసీల్దారుగా బదిలీ అయ్యారు.

17న జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్ ప్రయోగం

ఉపగ్రహ అనుసంధాన పనుల పూర్తి



ఇన్‌శాట్-త్రీడీఎస్ ఉపగ్రహం చుట్టూ అమర్చిన హీట్‌షీల్డ్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 8: ఇస్రో మరో కీలక ప్రయోగానికి సన్నద్ధమైంది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈ నెల 17న సాయంత్రం 5.30 గంటలకు జీఎస్ఎల్వీ-ఎఫ్ 14 రాకెట్‌ను ప్రయోగించనుంది. ఈ రాకెట్ ద్వారా ఇన్‌శాట్-త్రీడీఎస్ ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక సమీపంలోని వెహికల్ అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో ఇప్పటికే రెండు దశల రాకెట్ అనుసంధాన పనులు పూర్తయ్యాయి. గురువారం వ్యాబ్‌లో రాకెట్ శిఖర భాగాన ఉపగ్రహ అనుసంధానం చేపట్టి శాటిలైట్ చుట్టూ హీట్‌షీల్డ్ (ఉష్ణకవచం) అమర్చే ప్రక్రియను పూర్తి చేశారు.తుది పరీక్షలు నిర్వహించిన తరువాత రాకెట్‌ను ప్రయోగ వేదికకు తరలిస్తారు.

అగ్రోవెట్‌తో పద్మావతి వర్సిటీ ఒప్పందం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 8: పట్టు ఉత్పాదకత పెంపొందించే లక్ష్యంతో రెయిన్‌బో అగ్రోవెట్ సంస్థతో పద్మావతి మహిళా యూనివర్సిటీ ఒప్పందం చేసుకుంది. ఇందుకు సంబంధించిన పత్రాలపై ఇరు సంస్థల అధికారులు గురువారం సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రోవెట్ ఎండీ సుబ్బరాయుడు, డీన్ సుజాత, హెడ్ మమత, అధ్యాపకులు సావిత్రి, విజయకుమారి పాల్గొన్నారు.



ఒప్పంద పత్రాలతో ఇరు సంస్థల అధికారులు

జగనన్న కాలనీకోసం స్థలం చదును

● మనస్తాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం



స్థలాన్ని చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్లు

నగరి, ఫిబ్రవరి 8: ఎంత అడ్డుకున్నప్పటికీ తన ఇంటి స్థలాన్ని అధికారులు జగనన్న కాలనీకి తీసుకునేందుకు చదును చేయడంపై మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. బాధితురాలి కుటుంబీకులు తెలిపిన ప్రకారం.. నగరి మండలం కేజీ కుప్పానికి చెందిన సుమిత్రకు, అదే గ్రామంలో సుమారు 50 సెంట్ల గ్రామకంఠం భూమి ఉంది. ఏళ్ల తరబడి తన అధీనంలో ఉన్న భూమిని అధికారులు జగనన్న కాలనీకి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు స్వాధీనం చేసుకోవడానికి ప్రయత్నించగా ఆమె అడ్డు చెప్పారు. అయినా, అధికారులు పట్టించుకోకుండా గురువారం ఎక్స్‌కవేటర్లతో సంబంధిత భూమిని చదును చేశారు దీనిపై తీవ్ర మనోవేదనకు గురైన ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. స్థానికులు, బంధువులు గుర్తించి హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

చిత్తూరు లోక్‌సభ టీడీపీ టికెట్టుకోసం మాజీ ఎమ్మెల్యే కుమార్తె దరఖాస్తు



డాక్టర్ ఆశాజ్యోతి

పలమనేరు, ఫిబ్రవరి 8: చిత్తూరు పార్లమెంట్ నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీచేసేందుకు తనకు అవకాశమివ్వాలని కోరుతూ పలమనేరు మాజీ ఎమ్మెల్యే ఆంజినేయులు కుమార్తె ఆశాజ్యోతి(43) దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 4వతేది తన తండ్రి ఆంజినేయులుతో కలిసి ఆమె విజయవాడ వెళ్లారు. టీడీపీ అధినేత చంద్రబాబును కలిశారు. పలమనేరు నియోజకవర్గం నుంచి తొలిసారిగా తెలుగుదేశం పార్టీ నుంచి పోటీచేసి గెలిచిన ఆంజినేయులును చంద్రబాబు గుర్తించి సాదరంగా మాట్లాడారు. చిత్తూరు పార్లమెంట్ స్థానానికి తన కుమార్తెకు అవకాశమివ్వాలని ఆయన కోరారు. ఆ తర్వాత పార్టీ కార్యాలయంలో తన బయోడెటాతో పాటు ఆశాజ్యోతి దరఖాస్తు చేసుకొన్నారు. ప్రస్తుతం ఈమె కుప్పం పీఈఎస్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

● డ్రైవర్ అరెస్టు.. అసలు నిందితుడు పరారీ



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

వి.కోట, ఫిబ్రవరి 8: కర్ణాటకలో మద్యం కొనుగోలుచేసి వాహనాల్లో తరలించి మండల పరిధిలోని గ్రామా ల్లో విక్రయించే ముఠాను సీఐ లింగప్ప నేతృత్వంలో పోలీసులు పట్టుకున్నారు. గురువారం ఉదయం బైరుపల్లె క్రాస్ వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా అటుగా వచ్చిన కారు పోలీసులను చూసి వెనుతిరిగేందుకు యత్నించారు. పోలీసులు వెంబడించి పట్టుకుని సోదాచేయగా అందులో కర్ణాటక మద్యం భారీ ఎత్తున ఉన్నట్లు గుర్తించారు. రామకుప్పం మండలం కవ్వంపల్లెకు చెందిన కారు డ్రైవర్ అరుణ్‌కుమార్‌రెడ్డి పట్టుబడగా, ఇదే మండలం బలదారుకు చెందిన అసలు నిందితుడు వసంత్‌కుమార్‌రెడ్డి పరారయ్యాడు. ఈ మేరకు వి.కోట పోలీసులు కేసు నమోదు చేశారు. 30 కేసుల మద్యంతోపాటు, ఓ కారును సీజ్ చేసి అరుణ్‌కుమార్‌రెడ్డిని రిమాండుకు తరలించినట్లు పలమనేరు డీఎస్పీ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మద్యం విలువ సుమారు రూ.1.03 లక్షలు, సీజ్ చేసిన వాహనం విలువ రూ.5 లక్షలు మేరకు ఉంటుందన్నారు. నిందితులు వైసీపీకి చెందిన వారు కావడంతో వారిపై కేసు లేకుండా చేసేందుకు అధికార పార్టీనేతలు పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చినట్లు సమాచారం.

శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదినికి రూ.10,01,000 విరాళం



స్విమ్స్ డైరెక్టర్‌కు డీడీ అందజేస్తున్న కంపెనీ ప్రతినిధి రాఘవేంద్ర

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 8 : స్విమ్స్‌లో పేదలకు ఉచిత వైద్యం అందించే శ్రీబాలాజీ ఆరోగ్య వరప్రసాదిని పథకానికి చెన్నైకు చెందిన సీఎంజీ స్టీల్స్ కంపెనీ రూ. 10,01,000 విరాళంగా అందించింది. ఈ మేరకు తిరుపతికి చెందిన ఆ కంపెనీ ప్రతినిధి రాఘవేంద్ర గురువారం స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్‌ను డైరెక్టర్ ఛాంబర్‌లో కలిసి డీడీని అందజేశారు. పేదల వైద్య సేవల కోసం ఈ నగదు వినియోగించాలని కోరారు. డైరెక్టర్ ఆర్వీ కుమార్ మాట్లాడుతూ పేదలకు వైద్యం అందించేందుకు సహకరించిన సీఎంజీ స్టీల్స్ కంపెనీకి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.59 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.59 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 65,683 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 21,177 మంది తలనీలాలు సమర్పించారు.

సైంటిస్టు పోస్టులకు వాక్‌ఇన్ ఇంటర్వ్యూ

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 8 : స్విమ్స్ యూనివర్సిటీ క్లినికల్ వైరాలజీ విభాగంలోని పలు కాంట్రాక్టు పోస్టులకు ఈనెల 12న వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ అపర్ణబిట్ల గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సైంటిస్టు-సి 1, సైంటిస్టు-బి 1 రెండు నాన్ మెడికల్ పోస్టులతో పాటు ప్రాజెక్ట్ రీసెర్చ్ అసిస్టెంట్(నాన్ మెడికల్) 1 పోస్టు ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు పూర్తి చేసిన దరకాస్తులతో పాటు అన్ని సర్టిఫికెట్లు తీసుకుని 12వ తేదీ ఉదయం 8 గంటలకు డైరెక్టర్ చాంబర్ వద్ద ఉన్న కమిటీ హాల్లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. పూర్తి వివరాలకు స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని పేర్కొన్నారు.

నామసంకీర్తన భగవంతుడికి ప్రీతికరమైంది

పురందరదాసు ఆరాధన మహోత్సవాల్లో విద్యాప్రసన్నతీర్థ





తిరుమల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మానవ జీవితం సమస్యల వలయమని, వీటి నుంచి బయటపడాలంటే నామసంకీర్తన మంచి మార్గమని బెంగళూరులోని కుక్కే సుబ్రహ్మణ్య మఠాధిపతి విద్యాప్రసన్న తీర్థ ఉద్ఘాటించారు. నామ సంకీర్తన భగవంతుడికి అత్యంత ప్రీతికరమైందన్నారు. టీటీడీ దాససాహిత్య ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పురందరదాసు ఆరాధన మహోత్సవాలు గురువారం తిరుమలలోని ఆస్థాన మండపంలో ప్రారంభమయ్యాయి. విద్యాప్రసన్నతీర్థ మంగళాశాసనాలు అందిస్తూ.. భగవంతుడిని చేరాలంటే ముందు ఆయన పరమభక్తుల అనుగ్రహం అవసరమని పురాణాలు పేర్కొంటున్నాయని, ఈ కోవకు చెందిన భక్తుడు పురందరదాసు అని అన్నారు. ఆయన రచించిన లక్షలాది కీర్తనలను ఆలపిస్తూ అనేక మంది స్వామి కృపకు పాత్రులవుతున్నారన్నారు. దాససాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు మాట్లాడుతూ 4.75 లక్షల సంకీర్తనలు రచించడం పురందరదాసుకే సాధ్యమైందన్నారు. అనంతరం విద్యాప్రసన్న తీర్థను సన్మానించారు. ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమిళనాడు నుంచి 3,500 మందికిపైగా భజనమండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

నేడు నారాయణగిరికి శ్రీవారి వేంచేపు

ఆరాధన మహోత్సవాల్లో భాగంగా రెండవ రోజైన శుక్రవారం ఉదయం 10.30 గంటలకు సంగీత, సాహిత్య రంగాలలో నిష్ణాతులైన యువ కళాకారులకు ప్రతిభ పురస్కారాలు అందజేయనున్నారు. సాయంత్రం 6 గంటలకు తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనానికి శ్రీవారి ఉత్సవమూర్తులను వేంచేపు చేసి, ఊంజల్‌సేవ నిర్వహిస్తారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

ఈవీఎంల వినియోగంపై అవగాహన



పలమనేరు, ఫిబ్రవరి8 : పలమనేరు మున్సిపాలిటీలో ఈవీఎంల వినియోగంపై గురువారం ప్రజలకు, రాజకీయ నాయకులకు అవగాహన కల్పించారు. మున్సిపాలిటీలోని 243, 244, 245, 235, 236, 237, 238 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఈవీఎంల ద్వారా ఓటు ఏవిధంగా వేయాలి అనే దానిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నోడల్ అధికారి ఎస్.కె. ఖాదర్‌మొహిద్దీన్, సెక్టోరల్ అధికారి, ఎంఈవో, పట్టణ బీజేపీ కన్వీనర్ తాతయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్షతగాత్రుడికి ఆర్థిక సాయం

చౌడేపల్లె, ఫిబ్రవరి8 : ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తికి చికిత్స కోసం వెంగళపల్లె గ్రామస్తులు రూ.1.15లక్షలు ఆర్థిక సాయం అందించారు. గ్రామస్తుల కథనం మేరకు... మండలంలోని వెంగళపల్లెకు చెందిన రాధాకృష్ణ కుమారుడు చాకలి రెడ్డిప్రసాద్(30) కర్ణాటక రాష్ట్రం గుండుగళ్ళులోని ఓ సిమెంట్ ఇటుకల బట్టీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో 3 రోజులక్రితం ప్రమాదవశాత్తూ ఇసుక, కంకర, సిమెంట్ మిక్సింగ్ మిషన్ గ్రైండర్‌లో పడిపోయాడు. ఈ ప్రమాదంలో రెడ్డిప్రసాద్ వెన్నుపూస దెబ్బతింది. వెంటనే అతడి సహచరులు, కుటుంబసభ్యులు తిరుపతి రుయా, ఆ తర్వాత బర్డ్‌లో చేర్పించారు. వైద్యుల సూచన మేరకు వేలూరు సీఎంసీకి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడు రెడ్డిప్రసాద్ పేద కుటుంబానికి చెందినవాడు కావడంతో వెంగళపల్లె గ్రామస్తులందరూ కలసి ప్రతి ఇంటింటికి చందాల రూపంలో వసూలు చేసి రూ.1.15 లక్షలను వేలూరు ఆసుపత్రికి వెళ్లి ఆర్థిక సాయం అందించారు. గ్రామస్తులు ఇలా ఏక తాటిపై కలసి సాయం చేయడంతో వారి ఐక్యతతోపాటు వారి సేవా ధృక్పథాన్ని చాటుకున్నారు.

'ఆసరా'తో కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగు



మాట్లాడుతున్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్

సోమల, ఫిబ్రవరి 8: ఆసరా నగదుతో వెలుగు మహిళలు కుటుంబ ఆర్థిక పరిస్థితిని మెరుగు పరచుకోవాలని జడ్పీ మాజీ వైస్ చైర్మన్ పెద్దిరెడ్డి అన్నారు. గురువారం వెలుగు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంఘమిత్రలు తమ విధులను సక్రమంగా నిర్వహించి సభ్యులకు సహకరించాలన్నారు. సమావేశంలో ఎంపీపీ ఈశ్వరయ్య, జడ్పీటీసీ కుసుమ, ఎంపీడీవో వరప్రసాద్, వైస్‌ఎంపీపీ ప్రభాకర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

1912కు ఫోన్ చేస్తే
విద్యుత్ సమస్యలు పరిష్కారం



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ డైరెక్టర్ ఎన్‌వీఎస్ సుబ్బరాజు

పుంగనూరు, ఫిబ్రవరి8: విద్యుత్ సమస్యలపై 1912కి ఫోన్‌కాల్ చేస్తే వెంటనే పరిష్కరిస్తామని తిరుపతి హెచ్‌ఆర్‌డీ టెక్నికల్ డైరెక్టర్ ఎన్వీఎస్ సుబ్బరాజు తెలిపారు. గురువారం పుంగనూరు మండలం బండ్లపల్లె, పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయిన వెంటనే సంబంధిత ఏఈలకు ఫిర్యాదు చేస్తే మార్పు చేస్తారన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఫీజులు కాలిపోయినట్లు గుర్తించిన రైతులు వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి అధిక మొత్తం బకాయిలు ఉన్నట్లు తెలిపారు. ఆయన వెంట పుంగనూరు విద్యుత్‌శాఖ ఈఈ శ్రీనివాసమూర్తి, ఏడీఈలు రవి, నరేంద్ర, చిన సుబ్బ, ఏఈలు శశిధర్, నవీన్‌కుమార్, ధనంజయమూర్తి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి8: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీని బలోపేతం చేయడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని పుంగనూరు నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ మదన్‌మోహన్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పల్లెకు పోదాం కార్యక్రమం ద్వారా గ్రామాల్లో పర్యటించి బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న పథకాలు ప్రజలకు వివరించాల్సివుందన్నారు. బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, మరం బాబు, విజయశంకర్, శ్రీనివాసులు, నరసింహులు, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

బైరెడ్డిపల్లె, ఫిబ్రవరి 8 : ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్టీయూ జిల్లా నాయకులు మదన్‌మోహన్‌రెడ్డి, మోహన్ డిమాండ్ చేశారు. ఎస్టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా గురువారం వారు మండలంలోని జడ్పీఉన్నత పాఠశాల ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం 12వ పీఆర్సీకి సంబంధించి ఐఆర్ 30శాతం ప్రకటించాలని, పెండింగ్‌లోవున్న పీఎఫ్ మంజూరు చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు వాసు, చైతన్యాచారి, పార్థసారథి, సురేష్‌బాబు, భరత్, వినోద్, రవి, తిరుమలేష్, విజయ్, శ్రీనివాసులు, చంద్రప్ప, భాస్కర్, నరేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు



పుంగనూరు రూరల్, ఫిబ్రవరి8: ఆర్టీసీ ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నట్లు పుంగనూరు డిపో మేనేజర్ సుధాకరయ్య తెలిపారు. గురువారం కొంత మంది ప్రయాణికులకు డిపో ఆవరణలో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరు నుంచి రాయచోటి, ముళబాగళ్, తిరుపతి మార్గాల్లో ప్రయాణించే ప్రయాణికుల టిక్కెట్లను లక్కీడిప్‌ల ద్వారా ఎంపిక చేసిన వారికి బహుమతులు అందజేసినట్లు ఆయన తెలిపారు. పుంగనూరు - కలికిరి మార్గంలో రమణమ్మ, రెడ్డెమ్మ, పుంగనూరు-రాయచోటి మార్గంలో లేహశ్రీ, సుబ్రహ్మణ్యం, ముళబాగళ్ మార్గంలో శిల్ప, వంశీకృష్ణ, తిరుపతి మార్గంలో మీనాక్షి, జస్సికలు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో డిపో అభివృద్ధి కమిటీ చైర్మన్ జయరామిరెడ్డి, ఆర్టీసీ అధికారులు సంధ్య, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

మామిడిలో కానరాని పూత



సోమల, ఫిబ్రవరి 8: మామిడిలో పూత సక్రమంగా రాకపోవడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. ఆశించిన స్థాయిలో పూత లేకపోవడంతో మందుల పిచికారీ చర్యలు రెండోసారి చేపట్టారు. వేలకువేలు పెట్టుబడులు పెడుతున్నారు. మండలంలోని 15 పంచాయతీల్లో 6 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి. మంచు ప్రభావం తీవ్రంగా ఉండి పూత రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమల మండలంలో బేనిషా, మల్లికా, నీలం, తోతాపురి తదితర రకాలు సాగులో ఉన్నాయి. ఈసారి మల్లికా రకంలో ఒక్క చెట్టుకు కూడా పూత రాలేదు. 70 శాతం మామిడి తోటల్లో పూత సక్రమంగా కనిపించడంలేదు. రసాయనిక మందుల పిచికారీ కోసం ఎకరానికి రూ.7వేలు ఖర్చు చేస్తున్నారు. పూతలు లేకపోవడంతో వ్యాపారస్తులు తోటలు కొనుగోలుకు వెనుకడుగు వేస్తున్నారు. ఈక్రమంలో రైతులు మందుల పిచికారీపై మొగ్గ చూపుతున్నారు. ఉద్యానాధికారులు చొరవ తీసుకుని రాయితీపై మందులు సరఫరా చేయాలని కోరుతున్నారు.

నేడు మంత్రి పెద్దిరెడ్డి పుంగనూరు పర్యటన

పుంగనూరు : మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శుక్రవారం బీఎంఎస్ క్లబ్ ఆవరణలో ఆసరా పథకం చెక్కులు ఇవ్వనున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీంబాషా తెలిపారు. అలాగే మార్కెట్‌యార్డులో మండలానికి సంబంధించి ఆసరా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి తెలిపారు.

వేలం పాటలతో బోయకొండకు రూ.కోటి ఆదాయం



వేలం పాటలు నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

చౌడేపల్లె, ఫిబ్రవరి 8: వేలంపాటల ద్వారా బోయకొండ గంగమ్మ ఆలయానికి రూ.కోటి ఆదాయం చేకూరినట్లు ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి పేర్కొన్నారు. గురువారం బోయకొండ గంగమ్మ ఆలయ ప్రధాన కార్యాలయంలో రెండవ రోజు వేలంపాటలు నిర్వహించారు. కొండపైన క్యాంటీన్, ఐస్‌క్రీమ్‌లు, కూల్ డ్రింక్స్ విక్రయించుకునే హక్కును రూ.20.10లక్షలకు, కొండపైన షాపు నంబర్-1 పవిత్ర దారాలు, బొమ్మలు, కలకండ, వగైరాలు విక్రయించుకునే హక్కును రూ.17.25లక్షలకు గంగిరెడ్డి దక్కించుకున్నారు. అలాగే షాపునంబర్-2 పవిత్ర దారాలు, బొమ్మలు, కలకండ, వగైరాలు హక్కును రూ.12.75 లక్షలతో సురేంద్ర దక్కించుకున్నారు. అలాగే కొండపైన షాపు నంబర్-3 పవిత్రదారాలు, బొమ్మలు,కలకండ, వగైరాలు విక్రయించుకునే హక్కును రూ.19.06 లక్షలకు రెడ్డెప్ప దక్కించుకున్నారు. కొండపైన షాపునంబర్-4 పవిత్ర దారాలు, బొమ్మలు, కలకండ, వగైరాలు విక్రయించుకునే హక్కును రూ.17.25 లక్షలకు నరసింహులు దక్కించుకున్నారు. పేపర్ బ్యాగులు, కవర్లు విక్రయించుకునే హక్కును రూ.13.10లక్షలకు ఆంజనేయులు దక్కించుకున్నారు. అలాగే ఫొటోలు తీసుకునే హక్కును రూ.1.62లక్షలకు ప్రసాద్ దక్కించుకున్నారు. గురువారం నిర్వహించిన వేలం ద్వారా రూ.1,01,13,000 ఆదాయం ఆలయానికి చేకూరింది. గతేడాది కన్నా రూ.20.63 లక్షలు అధిక ఆదాయం చేకూరినట్లు తెలిపారు. కొండ కింద క్యాంటీన్, ఐస్‌క్రీమ్, కూల్ డ్రింక్స్, కోళ్ల విక్రయం, పాదరక్షలను భద్రపర్చడం, కొండ కింద తాత్కాలిక అంగళ్ల నిర్వహణ, కొబ్బరి చిప్పల సేకరణ హక్కుల వేలంపాటలు వాయిదా పడినట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు రాజేష్, భారతి, బుడ్డమ్మ, పవన్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, హైమావతి, గ్రూప్ టెంపుల్స్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

దళిత విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించాలి



గాంధీనగరంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు, విగ్రహావిష్కరణలో దళితనేతలు, ఫాదర్‌ఆంథోనీ

రామకుప్పం, ఫిబ్రవరి 8: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తిగా దళిత విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి, ఉత్తమ పౌరులుగా ఎదగాలని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్నన్, మాజీ ఎంపీపీ వెంకటేశ్, ఫాదర్ ఆంథోనీ కోరారు. గురువారం రామకుప్పం మండలం కెంచనబల్ల పంచాయతీ గాంధీనగరంలో అంబేడ్కర్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాగా చదువుకుంటేనే విద్యార్థులు మంచి భవిష్యత్‌ను పొందగల్గుతారని. ఇందుకు నిదర్శనం అంబేడ్కర్ జీవితమేనన్నారు. అంబేడ్కర్ చలువతోనే రిజర్వేషన్ల ఫలాలు అందుకుంటున్నామని వారు తెలిపారు. ఇప్పటికీ ఇంకా కులవివక్షత అనేది కొనసాగుతోందని, దానిని నిర్మూలించేందుకు ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాలని వారు డిమాండు చేశారు. దళితులు ఏ రాజకీయ పార్టీల్లో ఉన్నా, వారి అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. గాంధీనగరంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు సహకరించిన ఫాదర్‌ఆంథోనీ, రామాంజనేయులు, అశోకచక్రవర్తి యువజనసంఘం సభ్యులను వారు అభినందించారు. కార్యక్రమంలో జనసేన కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేష్, దళిత నేతలు రామకృష్ణప్ప, కందస్వామి, రఘు, నారాయణప్ప,బద్రి, రమణ, విజయ్‌కుమార్, మునస్వామి, బాలాజీ, స్పందనరాజ్, రామస్వామి, చంద్ర, మనోహర్, శివరాం, రాజశేఖర్, నవీన్ పాల్గొన్నారు.

వైసీపీ అవినీతి, అక్రమాలను ప్రచారం చేయాలి

మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

శాంతిపురం, ఫిబ్రవరి 7 : వైసీపీ అవినీతి, అక్రమాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రజలకు చేరవేయాలని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ్‌నాయుడు సూచించారు. గురువారం శాంతిపురం మండలంలోని శివరామపురం, అబకలదొడ్డి, గుంజార్లపల్లె గ్రామాల్లో పార్టీ సమావేశాలు జరిగాయి. వారు మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన మానిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాల గురించి ప్రతి ఇంట్లో చర్చించుకునేలా మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యకర్తలు, నాయకులు జనసేన నేతలను కలుపుకుని సమన్వయంతో ఎన్నికల ప్రచారం చేయాలన్నారు. ప్రతి ఓటు విలువైందని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఉదయకుమార్‌నాయుడు, మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు విజయరామిరెడ్డి, టీడీపీ నేతలు చంద్రశేఖర్, భాస్కర్, ఆంజనేయరెడ్డి, మణి, నారాయణరెడ్డి, ఉయ్యాల జయరామిరెడ్డి, రుద్రప్ప, శేఖర్, దాము, వెంకటేష్, మాజీ ఎంపీపీ పుష్ప, మండల మహిళ అధ్యక్షురాలు శ్యామల, మండల తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి రూప, పౌలారాణి తదితరులు పాల్గొన్నారు.

ఇదొక బూటకపు బడ్జెట్ : టీడీపీ



మాట్లాడుతున్న పీఎస్ మునిరత్నం తదితరులు

కుప్పం, ఫిబ్రవరి 8: వైసీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ బూటకపు బడ్జెట్ అని తెలుగుదేశం పార్టీ ధ్వజమెత్తింది. నాలుగు నెలల్లో అత్యధికంగా వ్యయం చూపి ఎన్నికలను గెలవడానికి ఈ బడ్జెట్ ప్రవేశపెట్టారని ఆరోపించింది. టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నం గురువారం మాట్లాడుతూ కేవలం 4 నెలల కాలానికి ఏకంగా రూ.లక్షా 8 వేల కోట్లు ఖర్చుపెట్టే పరిస్థితి వచ్చిందంటే ఎన్నికలకోసమే ఈ బడ్జెట్టు ప్రవేశపెట్టారన్న విషయం అర్థమవుతున్నదన్నారు. బడ్జెట్‌లో వ్యయానికి, ఆదాయానికి మధ్య చాలా వ్యత్యాసముందన్నారు. ఆదాయ మార్గాలు ఏవీ చూపకుండా ఖర్చులు పెట్టుకుంటూ పోవడంవల్లే రాష్ట్రం అథోగతికి దిగజారిందని విమర్శించారు. గత 5 ఏళ్లలో బీసీ సబ్ ప్లాన్ కోసం రూ.75వేల కోట్లను కేటాయించినట్లు చూపారన్నారు. అయితే ఈ నిధుల్లో కనీసం 50శాతం కూడా ఖర్చు చేయలేకపోయారని విమర్శించారు. వ్యవసాయరంగం టార్గెట్‌లో 61 శాతం నిధులను మాత్రమే ఖర్చు పెట్టారని చెప్పారు. సమావేశంలో టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, నాయీబ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు శాంతారాం, టీడీపీ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలోనే బీసీలకు గుర్తింపు : చల్లా



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఫిబ్రవరి 8: తెలుగుదేశం పార్టీలోనే బీసీలకు గుర్తింపు వచ్చిందని పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం పుంగనూరు మండలం ఈడిగపల్లె సమీపంలో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశంపార్టీ బీసీల పార్టీ అని, బీసీలు లేనిదే టీడీపీ లేదన్నారు. బీసీల అభివృద్ధి కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. మంత్రి పెద్దిరెడ్డిని ప్రజలు ఈ ఎన్నికల్లో ఇంటికి పంపడం ఖాయమని, బీసీలంతా ఐక్యమత్యంతో ఎన్నికల్లో పనిచేసి టీడీపీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. రాజంపేట పార్లమెంట్ బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్ మాట్లాడుతూ అవినీతి కార్యక్రమాలు చేస్తున్న మంత్రి కుటుంబాన్ని ప్రజలు ఎన్నికల్లో ఓడించాలని ఎదురుచూస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ నాయకులు ఎం.శ్రీకాంత్, బి. వెంకటముని యాదవ్, వల్లిగట్ల వెంకట్రమణ, గుత్తికొండ త్యాగరాజు, మాధవరెడ్డి, ఉయ్యాల రమణ, సుహేల్‌బాషా, నరసింహులు, జనసేన నాయకులు పగడాల రమణ, చిన్నారాయల్, విరూపాక్షి పాల్గొన్నారు.

ఏటీఎంలో తక్కువగా వచ్చిన నగదు
- అవాక్కయిన వినియోగదారులు

రామకుప్పం, ఫిబ్రవరి 8: పట్టణంలోని టాటా ఇండిక్యాష్ ఏటీఎంలో గురువారం డబ్బులు డ్రా చేసిన వినియోగదారులు షాక్‌కు గురయ్యారు. ఒకరు రూ.500 డ్రా చేయగా కేవలం రూ.100మాత్రమే వచ్చింది. మరొకరు 5000 డ్రా చేయగా రూ.3100 మాత్రమే వచ్చింది. మరో వ్యక్తి రూ.2000 డ్రా చేయగా రూ.1800 వచ్చింది. ఉదయం నుంచి 20మందికి పైగా వినియోగదారులకు ఇదే అనుభవం ఎదురైంది. నగదు తక్కువగా వచ్చినప్పటికీ రసీదుల్లో మాత్రం వినియోగదారులు ఎంత ఎంట్రీ చేశారో అంతే నమోదైంది. ఏటీఎం నిర్వాహకులు తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం

రొంపిచెర్ల,ఫిబ్రవరి8: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో రక్తహీనత దూరమవుతుందని డాక్టరు దినేష్‌కుమార్‌నాయక్ అన్నారు. గురువారం రొంపిచెర్ల పాథమిక ఆరోగ్యకేంద్రంలో ప్రధాన మంత్రి మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గర్భిణికి వైద్య పరీక్షలు చేసి, మందులు ఇచ్చి వైద్యసలహాలు ఇచ్చారు. మహిళలు ఆకుకూరలు, పండ్లరసాలు, ఎండు ద్రాక్ష, ఖర్జూరాలు, వేరుశనగ వుండలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఈ రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ పాల్గొన్నారు.

టీడీపీ నేత మునిరెడ్డి మృతి తీరని లోటు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 8: పుంగనూరు మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు మునిరెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అని టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువారం రాగానిపల్లె పంచాయతీ లక్కుంటకు చెందిన మునిరెడ్డి (70) ప్రస్తుతం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా పని చేస్తున్నారు. ఆయన మృతదేహానికి చల్లా బాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎన్.శ్రీనాథరెడ్డి, మాజీ ఇన్‌చార్జి ఎన్.అనీషారెడ్డి మునిరెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలి



రక్తదానం చేస్తున్న ఉపాధ్యాయులు

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 8: యువత రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని మానవత స్వచ్ఛందసేవా సంస్థ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ ప్రభాకర్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రభుత్వ డిగ్రీకాలేజీ ఆవరణలో రోటరీక్లబ్, మానవతసేవా సంస్థ కలసి రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని కొంతమంది ఉపాధ్యాయులు, విద్యార్థులు కలసి 50 యూనిట్లు రక్తదానం చేశారు. పలువురు మాట్లాడుతూ రక్తదానం చేయడం వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదని, తిరిగి 24గంటల్లో రక్తం ఉత్పత్తి అవుతుందన్నారు. కార్యక్రమంలో మానవతసేవా సంస్థ చైర్మన్ నందీశ్వరయ్య, పూలత్యాగరాజు, డాక్టర్ శరణ్‌కుమార్, నానబాల గణేశ్, సుధాకర్‌రెడ్డి, ఏసీ నారాయణరెడ్డి, భరత్‌భూషణ్, కాలేజీ ప్రిన్సిపాల్ రాజశేఖర్, అధ్యాపకులు శ్రీనివాసులు, డాక్టర్లు అమరావతి, మధులిక పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

గంగవరం, ఫిబ్రవరి 8: మదర్‌థెరీసా కళాశాలలో గురువారం డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించినట్లు కళాశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు తెలిపారు. విద్యార్థులతోపాటు బస్సు డ్రైవర్లు, క్లీనర్లు, అధ్యాపకులు, సిబ్బందికి ఉచితంగా కంటిపరీక్షలు చేపట్టి అవసరమైన వారికి కంటి అద్దాలు వాడే విధానం, జాగ్రత్తలను కంటివైద్య నిపుణులు క్షుణ్ణంగా వివరించారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సునీల్, అకడమిక్ డైరెక్టర్ రాజేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎస్ఎస్ఎస్ కిషోర్, ఆసుపత్రి మేనేజర్ శివనాగేశ్వరరావు, వైద్యులు పల్లవి, ఎమాన్యుయల్ రాజ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ట్రస్ట్ ఉచిత వైద్య శిబిరం



కుప్పం, ఫిబ్రవరి 8: కుప్పం పురపాలక సంఘం డీకే పల్లె ఎస్టీ కాలనీలో గురువారం ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆరోగ్య రథం ద్వారా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డ్టార్ మధు, ఫార్మసీ సిబ్బంది ఝాన్సీరాణి ప్రజలకు పరీక్షలు చేసి, మందులు కూడా ఉచితంగానే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్ తదితరులు మాట్లాడుతూ ఎన్టీఆర్ ట్రస్ట్ ఆరోగ్య రథం ద్వారా ఇప్పటికి 150 రోజులపాటు 110 క్యాంపులు నిర్వహించామని చెప్పారు. తద్వారా 8 వేల మందికి ఉచిత వైద్య పరీక్షలు జరిపి, మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. టీడీపీ నాయకులు మణి, నబి పాల్గొన్నారు.

దుకాణాల తనిఖీ



గుడుపల్లె, ఫిబ్రవరి 8: మండలంలోని పలు దుకాణాల్లో తూనికలను పలమనేరు తూనికల శాఖ అధికారిణి రమాదేవి గురువారం తనిఖీ నిర్వహించారు. స్కేళ్లు, త్రాసులు పరిశీలించి సరిచేసి సీల్డ్ ట్యాగ్‌లు, కేజీ బొట్లకు ముద్రలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుకాణాదారులు తూనికలకు వేసిన సీల్‌లను తొలగించి వినియోగదారులను మోసాలు చేస్తే భారీ జరిమానాలు వేస్తామని హెచ్చరించారు. తూనికల్లో తేడాలు ఉంటే వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు.

పాఠశాల తనిఖీ

పలమనేరు, ఫిబ్రవరి8 : మండలంలోని శ్రీరంగరాజపురం ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు, అకడమిక్ స్టాండర్డు, అన్ని సబ్జెక్టుల వర్కుబుక్కు, అడ్మిషన్ రిజిస్టర్, మధ్యాహ్నభోజన రిజిస్టర్, టీఏఆర్ ఎల్ ఆక్టివిటీస్ పరిశీలించారు. మధ్యాహ్న భోజనం తయారు చేసే మహిళలకు ఏరోజు మెనూ మేరకు మాత్రమే వంటను రుచికరంగా వండి విద్యార్థులకు వడ్డించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెడిసిన్ ర్యాంకర్‌కు సత్కారం

కుప్పం, ఫిబ్రవరి 8: ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాలలో 82.72 శాతం మార్కులు సాధించి పీఈఎస్ వైద్య కళాశాల టాప్ 2 ర్యాంకర్‌గా నిలిచిన విద్యార్థిని ధార్మిక శ్రేష్ఠను గురువారం టీడీపీ నాయకులు సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, రూరల్ మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ సత్యేంద్రశేఖర్, శాంతారాం, జేకే. సంతోశ్, మణి, నాగభూషణం, నబి, నరేశ్ పాల్గొన్నారు.

టెన్నికాయిట్ విజేత
పెద్దఉప్పరపల్లె విద్యార్థిని



సోమల, ఫిబ్రవరి 8: ఈనెల 5న ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీల్లో పెద్దఉప్పరపల్లె విద్యార్థిని తేజశ్విని విజేతగా నిలిచినట్లు ఎంఈవో శివరత్న తెలిపారు. అంతర జిల్లాల పోటీల్లో బాలికల విభాగంలో తేజశ్విని విశేష ప్రతిమ కనబరచి విన్నర్స్‌గా నిలవడంతో హెచ్‌ఎం భాస్కర్, పీఈటీ మల్లేశ్వరి, ఉపాధ్యాయులు, సర్పంచు భారతి తదితరులు ఆ విద్యార్థిని అభినందించారు.

పోలింగ్ కేంద్రాల్లో
మౌలిక వసతులు కల్పించాలి

కల్లూరు, ఫిబ్రవరి 8: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని తహసీల్దార్ వసంతలత, ఎంపీడీఓ సురేష్‌బాబు తెలిపారు. పులిచెర్ల మండలం దేవళంపేట, పేరావాండ్లపల్లి, బాలిరెడ్డిగారిపల్లి పోలింగ్ కేంద్రాలను గురువారం వారు పరిశీలించారు.

రామకుప్పం : పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లుకు అన్ని సౌకర్యాలు ఉండేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని తహసీల్దారు శ్రీధర్ వీఆర్వోలు, వీఆర్ఏలను ఆదేశించారు. గురువారం ఆయన మండల పరిధి మణీంద్రం, కెంచనబల్లల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

బంగారు తిరుత్తణి కొండకు నిప్పు



సోమల, ఫిబ్రవరి8: సోమల-సదుం మార్గంలోని బంగారు తిరుత్తణికొండకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మంటలు కొండను చుట్టుముట్టాయి. దీంతో సదుం మార్గంలో మంటలు వ్యాపించాయి. కొండలోని పశుగ్రాసం బూడిదైంది. అలాగే కందూరు మార్గంలోని పొలాల వైపు మంటలు వ్యాపించాయి. కొండ దిగువ భాగంలోని మామిడి తోటలోకి మంటలు వ్యాపించాయి. మంటలు ఆర్పేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు.

అటవీ ఉద్యోగులకు టీ షర్టుల వితరణ

రామకుప్పం, ఫిబ్రవరి 8: కుప్పం, బెంగళూరు లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రేరణ వారు గురువారం రామకుప్పం మండలం ననియాల ఎలిఫెంట్ క్యాంపును సందర్శించారు. ఈ సందర్భంగా వారు అక్కడి అటవీ ఉద్యోగులకు సీడ్‌బాల్స్, టీషర్టులను వితరణగా అందజేశారు. అదేవిధంగా శిక్షణ పొందిన గజరాజులు జయంత్, వినాయక్‌లకు వారు ఒక్క రోజు ఆహారాన్ని అందించారు.

రేపు సదుంలో వైద్య శిబిరాలు

సదుం, ఫిబ్రవరి 8: సదుంలో శనివారం రెండు ఉచిత వైద్య శిబిరాలు జరగనున్నాయి. చెన్నైకు చెందిన మిషన్ ఫర్ విజన్ ట్రస్టు, శంకర్ నేత్రాలయ ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ ఉషారాణి గురువారం తెలిపారు. అలాగే స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో బెంగళూరుకు చెందిన వైదేహీ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ సెంటర్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ సదుం మణికంఠ అధ్యక్షుడు జయకుమార్ రెడ్డి తెలిపారు. వైద్య శిబిరాలకు వచ్చే వారు ఆధార్ కార్డు జిరాక్సు ప్రతులను తప్పనిసరిగా తీసుకురావాలని నిర్వాహకులు తెలిపారు.

టీడీపీ తీర్థం పుచ్చుకున్న వైసీపీ సానుభూతిపరుడు


వేదవ్యాసులకు టీడీపీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మురళీమోహన్

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 8: మండలంలోని చిల్లగుండ్లపల్లికి చెందిన వైసీపీ సానుభూతిపరుడు, మాజీ వలంటీరు వేదవ్యాసులు పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి మురళీమోహన్ సమక్షంలో గురువారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. మండలంలోని తంబుగానిపల్లె పంచాయతీ, బీసీ కాలనీ, హసన్‌పురం, చిల్లగుండ్లపల్లి గ్రామాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు మహేంద్ర, రమేష్, గిరిబాబు, హరిప్రసాద్, లోకనాథం నాయుడు, గోపాల్ నాయుడు, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల కొండపై అక్రమ నిర్మాణాలు
టీటీడీ ఈవోకు కనిపించవా..?: టీడీపీ


మాట్లాడుతున్న సప్తగిరి ప్రసాద్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 8: తిరుమల కొండపై అక్రమ నిర్మాణాలు టీటీడీ ఈవోకు కనిపించడం లేదా అని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ప్రశ్నించారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తిరుమలలో విశాఖ శారదా పీఠం వారు గోగర్భ డ్యాం సమీపంలో అక్రమ నిర్మాణం చేపడుతుంటే టీటీడీ అధికారులు ఏం చేస్తున్నారని అన్నారు. విశాఖ శారదా పీఠానికి 5 వేల అడుగులు కేటాయించినప్పటికీ వారు అదనంగా 4817 అడుగుల భూమిని ఆక్రమించుకున్నారని ఆరోపించారు. హైకోర్టులో ఒక భక్తుడు ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేస్తే కోర్టు తక్షణం నిర్మాణాలను ఆపాలని గతనెల 24న తీర్పు ఇచ్చినట్లు చెప్పారు. తక్షణం అక్రమ నిర్మాణాలను ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేతలు మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, మదు యాదవ్, జైపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమార్కులపై చర్యలు ఏవి..?


మాట్లాడుతున్న గంగరాజు

నగరి, ఫిబ్రవరి 8: ఇసుకను అక్రమంగా తమిళనాడుకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న అక్రమార్కులపై పోలీసు, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోకపోవడంలో అంతర్యమేమిటని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు ప్రశ్నించారు. గురువారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్ధరాత్రి వేళల్లో నగరి కుశస్థలి నది, తెరణి వద్ద ట్రాక్టర్లు, టిప్పర్లలో ఇసుకను తరలిస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకపోవడమే కాకుండా ఫిర్యాదు చేసిన బాధిత రైతులపైనే కేసులు నమోదు చేస్తామని బెదిరించడం దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. మంత్రి రోజా ఉన్న ఊరిలోనే అక్రమార్కులు బరి తెగిస్తుంటే నియోజకవర్గం మొత్తం ఎలా చెలరేగిపోతున్నారో అర్థమవుతోందన్నారు. ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తూ, అధికార పార్టీకి వత్తాసు పలుకుతున్న అధికారులపై జిల్లా కలెక్టర్ కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు. నియోజకవర్గంలోని ప్రజాసమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు షణ్ముగం, పెరుమాళ్, మైలుస్వామి, తంగరాజు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం


బహుమతులు అందిస్తున్న దొరబాబు, కాజూరు బాలాజి తదితరులు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 8: టీడీపీ, జనసేన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు పంచిపెట్టారు. గతేడాది డిసెంబర్ 24వ తేదీన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాజూరు బాలాజీ ఆధ్వర్యంలో చెన్నై హైవేలోని బంగారుపాళ్యం సమీపంలోని అమరరాజా ఫ్యాక్టరీ ఎదురుగా క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లో గెలుపొందిన విజేతలకు గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో బహుమతులు అందజేశారు. మొదటి బహుమతిని కెల్విన్ బ్లాక్ టీంకు రూ.లక్ష, రెండవ బహుమతిని సీవీఎస్ టీంకు రూ.50 వేలు, 3వ బహుమతిని పీఎస్ఆర్ టీంకు రూ.25 వేలు నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చంద్రప్రకాష్, సీఆర్ రాజన్, కోదండయాదవ్, కాజూరు రాజేష్, మోహన్‌రాజ్, శంకర్, తారక్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో మాస శివరాత్రి పండుగ

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 8: గిరింపేట సత్యసాయి సంస్థాన్‌లో గురువారం మాస శివరాత్రి పర్వదినాన్ని భక్తులు భక్తిప్రపత్తులతో నిర్వహించారు. సాయిలింగేశ్వరస్వామికి భక్తులు పవిత్ర జలం, పాలతో అభిషేకాలు నిర్వహించి రుద్రాభిషేకం చేశారు. అదేవిధంగా నగరంలోని వరదప్ప నాయుడు పాఠశాలలో త్వరలో జరుగనున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు బాగా రాసి ఉత్తీర్ణత పొందాలని కోరుతూ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన తరగతులు నిర్వహించారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణోత్సవం

పెనుమూరు, ఫిబ్రవరి 8: మండలంలోని కావూరివారిపల్లి వద్ద వెలసిన పార్వతీ సమేత రుణవిమోచనేశ్వరస్వామి ఆలయంలో గురువారం మాస శివరాత్రి సందర్భంగా పార్వతీ పరమేశ్వరస్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి వివిధ రకాల అభిషేకాలు జరిపి, మంగళ వాయిద్యాల నడుమ కల్యాణోత్సవాన్ని నిర్వహించగా, భక్తులు కనులారా వీక్షించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా కొత్తరోడ్డుకు చెందిన బాలసుబ్రమణ్యంశెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కృపానందం పిళ్లై తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దుపై అన్ని రాజకీయ పార్టీలు స్పందించాలి


పోస్టు కార్డులతో ఉపాధ్యాయులు

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 8: రాబోవు ఎన్నికల మ్యానిఫెస్టోలో సీపీఎస్, జీపీఎస్ రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చేస్తామని ఏ పార్టీ వారు వెల్లడిస్తారో వారికే తమ ఓటు వేస్తామని యూటీఎఫ్ అధ్యక్షుడు సోమశేఖర్ నాయుడు అన్నారు. ఉపాధ్యాయులు గురువారం పోస్టు కార్డుల ద్వారా తమ న్యాయమైన హక్కులను తీర్చాలని అన్ని రాజకీయ పార్టీ అధినేతలకు సమాచారం పంపారు. ఈ సందర్భంగా సోమశేఖర్ నాయుడు మాట్లాడుతూ ఎన్నికల వాగ్దానాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాణిపాకం జడ్పీ హైస్కూల్ హెచ్ఎం చంద్రశేఖర్ నాయుడు, ఉపాధ్యాయులు సురేంద్రబాబు, సురేష్, శాంతాదేవి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


విద్యార్థినులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 8: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరమని చిల్లామాకులపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం సత్యవేణి అన్నారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జరిగిన టెన్నిస్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినులను పాఠశాలలో గురువారం ఆమె అభినందించారు. ఈ పోటీల్లో సీనియర్స్ బాలికల విభాగంలో గౌతమి, పూజ, పి.కె.పూజ, హరిప్రియ, జూనియర్స్ విభాగంలో ఛార్మి, గాయత్రి విజయం సాధించారు.

క్రీడలు ప్రారంభం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 8: విద్యార్థుల మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని దేవళంపేట సోక్రటీస్ ఇంగ్లీషుమీడియం హైస్కూల్ కరస్పాండెంట్ గుణశేఖర్ తెలిపారు. గురువారం దేవళంపేటలో స్పోర్ట్స్ మీట్‌ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈనెల 10వ తేదీ వరకు ఎల్‌కేజీ నుంచి పదో తరగతి విద్యార్థుల వరకు షార్ట్‌పుట్, జావలిన్ త్రో, కబడ్డీ, కోకో, క్రికెట్, రన్నింగ్‌రేస్, డిస్కస్‌త్రో, టెన్నికాయిట్, స్కిప్పింగ్ తదితర క్రీడలు నిర్వహిస్తున్నామని చెప్పారు. ఉపాధ్యాయులు, పీఈటీ పాల్గొన్నారు.

ఎంపీ రేసులో పీటర్

గుడిపాల, ఫిబ్రవరి 8: మండలంలోని రాసనపల్లి దళితవాడకు చెందిన చిత్తూరు పార్లమెంటు ఎస్సీ సెల్ అధ్యక్షుడు పీటర్ చిత్తూరు ఎంపీ రేసుకు పోటీ పడుతున్నారు. ఈయన టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీ నేతలతో పాటు పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. మాజీ మంత్రి అమర్‌నాథరెడ్డి ద్వారా చిత్తూరు నాయకులతో కలిసి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. తనకు అవకాశం కల్పిస్తే ఎంపీ రేసుకు పోటీ చేస్తానని పీటర్ తెలిపారు.

పీహెచ్‌సీలో అన్నదానం


అన్నదానం చేస్తున్న శ్రీధర్‌రెడ్డి తదితరులు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 8: గంగాధరనెల్లూరు పీహెచ్‌సీలో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి హాజరైన రోగులు, సిబ్బంది 221 మందికి చిత్తూరు నగరానికి చెందిన కేశవరెడ్డి మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఛైర్మన్, చిత్తూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఎం.వి. శ్రీధర్‌రెడ్డి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, లయన్స్‌క్లబ్ సభ్యులు మోహన్‌రెడ్డి, జమీర్, తాకిద్, ఇండియన్ రెడ్‌క్రాస్ మండల అధ్యక్షుడు పాపిరెడ్డి, సీహెచ్‌వో శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు ధర్మేంద్ర, షైలా, వైద్యసిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో అన్నదానం

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 8: మండల కేంద్రమైన ఐరాలలో గురువారం అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు అన్నదానం చేశారు. ఇకపై ప్రతి రోజు వంద మందికి తక్కువ లేకుండా అన్నదానం నిర్వహిస్తామని నిర్వాహకులు మోతుకూరు సోమశేఖర్, నన్నపనేని వెంకటేష్ తెలిపారు. బస్సుల కోసం వేచి ఉన్నవారు, ప్రభుత్వాసుపత్రికి విచ్చేసే వారు ఇక్కడ భోజనం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జలీల్‌బాషా, ప్రసాద్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఆర్థిక సాయం


ఆర్థికసాయమిస్తున్న గురుసాల కిషన్‌చంద్

వెదురుకుప్పం, ఫిబ్రవరి 8: మండలంలోని బొమ్మయ్యపల్లె పంచాయతీ జడపావనపల్లిలో తెలుగుదేశంపార్టీ నాయకులు చెంగయ్య భార్య బుల్లెమ్మ(40) మృతి చెందారు. గురువారం సమాచారం తెలుసుకున్న టీడీపీ ఎన్ఆర్ఐ కో-ఆర్డినేటరు గురుసాల కిషన్‌చంద్ పార్టీ శ్రేణులతో కలసి మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. టీడీపీ నాయకుడు చెంగయ్యను పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. ఆయన వెంట నాయకులు రామకృష్ణ, బాలాజీ, నగేశ్ పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో
తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి


స్వామి సేవలో పాల్గొన్న న్యాయమూర్తి సురేపల్లి నంద

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 8: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సురేపల్లి నంద గురువారం కాణిపాక వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకున్నారు. ఆమెను సూపరింటెండెంట్ కోదండపాణి ఆలయ మర్యాదలతో ఆహ్వానించి స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. దర్శనానంతరం వేదాశీర్వాద మండపంలో వేదమంత్రాలతో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంపై ర్యాలీ

వెదురుకుప్పం, ఫిబ్రవరి 8: ఓటు హక్కు వినియోగంపై అవగాహన ర్యాలీని గురువారం బొమ్మయ్యపల్లె, బ్రాహ్మణపల్లె, కొమరగుంట గ్రామాల్లో నిర్వహించారు. వెలుగు ఏపీఎం కవిత మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటుకు సంబంధించిన ప్రతిజ్ఞ చేశారు.

అంబేద్కర్ భవన నిర్మాణానికి భూమిపూజ

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 8: బంగారుపాళ్యం పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో గురువారం అంబేడ్కర్ భవన నిర్మాణానికి దళిత నాయకులు భూమి పూజలు చేశారు. ఈ భవన నిర్మాణానికి ఎంపీ నిధుల నుంచి రూ.25 లక్షలు మంజూరైనట్లు వారు తెలిపారు. రాజశేఖర్, చంద్రన్, దేవయ్య, మాణిక్యం, మొగిలయ్య, గోవింద్, నవీన్, ఉషారాణి, సోమశేఖర్, కామరాజు, పరదేశి, పీఆర్ ఏఈ గురవారెడ్డి పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి పంపేందుకు ప్రజలు సిద్ధం

● మాజీ ఎమ్మెల్సీ దొరబాబు


ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 8: వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్సీ దొరబాబు అన్నారు. గురువారం నగరంలోని 40, 41, 43వ డివిజన్లలోని సంతపేట, లక్ష్మీథియేటర్, చర్చివీధి తదితర ప్రాంతాల్లో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో గడప గడపకు రా.. కదలిరా కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రజలను అనేక ఇబ్బందులకు గురిచేస్తోందని చెప్పారు. అధికారులను అడ్డుపెట్టుకుని వైసీపీ నేతలు అనేక అక్రమాలకు పాల్పడుతూ ప్రజాధనాన్ని దోచుకుంటున్నారని విమర్శించారు. సీఎం జగన్ ఎప్పుడో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయారని అన్నారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం జరుగుతుందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీని అత్యంత భారీ మెజారిటీతో గెలిపించి, చంద్రబాబును సీఎం చేయడమే తమ లక్ష్యమని చెప్పారు. అనంతరం స్థానికులకు టీడీపీ మినీ మ్యానిఫెస్టోతో ముద్రించిన కరపత్రాలను పంచిపెట్టారు. పార్టీ నేతలకు స్థానికులు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నేతలు చంద్రప్రకాష్, కటారి హేమలత, గురజాల జగన్‌మోహన్, కాజూరు బాలాజి, సీఆర్ రాజన్, వెంకటరమణ, డిన్ను, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వేగంగా జనన, మరణ ధ్రువపత్రాల జారీ

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కరుణకుమార్



ధ్రువపత్రాలను పంపిణీ చేస్తున్న కరుణకుమార్ తదితరులు

చిత్తూరు, ఫిబ్రవరి 8: జనన, మరణ, మ్యారేజ్ రిజిస్ట్రేషన్లు, ధ్రువపత్రాల జారీ సులభంగా వేగంగా జరగాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ అన్నారు. ధ్రువపత్రాల జారీపై గురువారం నగరపాలక కార్యాలయంలో నగరపాలకసంస్థ, పంచాయతీరాజ్, జిల్లా రిజిస్ట్రార్ శాఖల అధికారులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనన, మరణ, మ్యారేజ్ రిజిస్ట్రేషన్ చట్టాలపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని సూచించారు. ప్రతి మనిషి జీవితంలో ఈ మూడు అంశాలకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ, ధ్రువపత్రాల జారీ పారదర్శకంగా జరగాలన్నారు. కమిషనర్ అరుణ మాట్లాడుతూ జనన, మరణ, వివాహ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను నగరపాలక సంస్థ పరిధిలో పక్కాగా నిర్వహిస్తున్నామన్నారు. మరింత సులభతరం చేసేలా ఆన్‌లైన్‌పోర్టల్‌లో అందుబాటులోకి తెచ్చామన్నారు. జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆన్‌లైన్ స్లాట్ బుక్ చేసుకోవడం వల్ల సకాలంలో ధ్రువపత్రాలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారికి ధ్రువపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీపీవో లక్ష్మీ, సహాయ కమిషనర్ గోవర్ధన్, పలమనేరు కమిషనర్ రమణారెడ్డి, ఎంహెచ్‌వో లోకేష్, సీఎంఎం గోపి తదితరులు పాల్గొన్నారు.

వేటగాళ్ల ఉచ్చుకు బలవుతున్న అడవిపందులు

పాలసముద్రం, ఫిబ్రవరి 8: మండలంలో కొందరు వేటగాళ్లు అడవిపందులను ఉచ్చులు, రాత్రిపూట విద్యుత్ వైర్లు వేసి చంపేస్తున్నారు. అడవుల్లో జంతువులకు తాగునీరు లేకపోవడంతో సమీపంలో ఉండే పంట పొలాలు, చెరువుల వద్దకు రాత్రిపూట సంచరిస్తాయి. అడవి పందులు సంచరించే ప్రాంతాలను వేటగాళ్లు గుర్తించి విద్యుత్ వైర్లు, నాటుబాంబులు ఉపయోగించి వాటిని చంపేస్తున్నారు. కిలో అడవి పంది మాంసాన్ని రూ.200 నుంచి రూ.250 వరకు విక్రయిస్తున్నారు. మద్యం షాపుల సమీపంలో ఉండే హోటళ్లలో మందుబాబుల కోసం అడవి పంది మాంసాన్ని విక్రయిస్తున్నారు. ఈ అడవి జంతువులను సంహరించే విషయం అటవీశాఖ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. వేటగాళ్ల వద్ద అటవీశాఖ సిబ్బంది మామూళ్లు తీసుకుంటూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. వేటగాళ్లను కట్టడిచేయాల్సిన అవసరం సంబంధిత అధికారులపై ఉంది.

హైకోర్టును ఆశ్రయించిన
నారగల్లు బాధితులు

గుడిపాల, ఫిబ్రవరి 8: మండలంలోని నారగల్లు గ్రామంలో మంగళవారం రాత్రి రెవెన్యూ అధికారులు ఎటువంటి నోటీసులు గానీ, సమాచారం ఇవ్వకుండా నాటిన మామిడి చెట్లను నరికివేసి, అక్కడున్న షెడ్డును కూల్చివేయడంతో బాధితులైన మాజీ సర్పంచ్ నాగరాజ్ కుటుంబసభ్యులు గురువారం హైకోర్టును ఆశ్రయించారు. 2006లో ప్రభుత్వమే తమకు పాసుబుక్‌లను మంజూరు చేసి, ఇప్పుడు అకారణంగా చెట్లను తొలగించి రెవెన్యూ అధికారులు తీవ్ర నష్టాన్ని కలిగించారని, దీంతో న్యాయం కోసం హైకోర్టును ఆశ్రయించినట్లు బాధితులు తెలిపారు.

ప్రారంభం కాకముందే శిథిలావస్థకు చేరిన
వాటర్ ట్యాంకు



గుడిపాల, ఫిబ్రవరి 8: మండలంలోని వెంగంపల్లి అరుంధతివాడలో నిర్మించిన వాటర్ ట్యాంకు ప్రారంభానికి నోచుకోకనే పెచ్చులూడి కూలడానికి సిద్ధంగా ఉంది. గత పదేళ్ల క్రితం అప్పటి ఎమ్మెల్యే సీకే బాబు హయాంలో నిర్మించిన ఈ వాటర్ ట్యాంకు ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన ఈ వాటర్ ట్యాంకు కూలేందుకు సిద్ధంగా ఉంది. ఇదిలా ఉండగా ప్రస్తుతం కాలనీలో మినీ ట్యాంకును ఏర్పాటు చేసుకుని నీటిని సరఫరా చేసుకుంటున్నారు. ప్రారంభానికి నోచుకోకుండా వృథాగా వున్న ట్యాంకు కొద్దికొద్దిగా పెచ్చులూడి పడిపోతోంది. దీంతో ఎప్పుడు అది కూలిపోతుందోనని గ్రామస్తులు భయం గుప్పిట్లో ఉన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవచూపి ఆ ట్యాంకును బాగుచేయించి ప్రారంభించి, ప్రజలకు వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దేవదాయశాఖ ఏసీకి పదోన్నతి


ఏకాంబరంను సత్కరిస్తున్న సుబ్రమణ్యం నాయుడు, చెంగల్‌రాయలు

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 8: జిల్లా దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనరు ఏకాంబరంకు రాష్ట్ర దేవదాయశాఖ అధికారులు డిప్యూటీ కమిషనరుగా పదోన్నతి కల్పిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీ ఏకాంబరంను జిల్లాలోని చౌడేపల్లె బోయకొండ గంగమ్మ ఆలయానికి డీసీగా నియమించారు. పదోన్నతి పొందిన ఏకాంబరంను ఏసీ కార్యాలయ సిబ్బంది, స్థానిక ఆలయాల ఈవోలు సన్మానించి, అభినందనలు తెలిపారు. అదేవిధంగా కోదండ రామాలయ అర్చకులు వేణుగోపాల్ డీసీకి స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

డీఎస్సీ ప్రకటన నిరుద్యోగులను మోసగించడమే

● పీసీసీ మీడియా అధికార ప్రతినిధి గోవర్ధన రెడ్డి

కార్వేటినగరం, ఫిబ్రవరి 8: రాష్ట్ర ప్రభుత్వ తాజా డీఎస్సీ ప్రకటన నిరుద్యోగులను మోసగించే చర్య అని పీసీసీ మీడియా అధికార ప్రతినిధి గోవర్ధన్ రెడ్డి విమర్శించారు. కార్వేటినగరంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులను పట్టించుకోలేదని అన్నారు. ఇపుడు అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో నిరుద్యోగులు గుర్తుకొచ్చారా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో పాఠశాల విద్యా వ్యవస్థలను నాశనం చేశారని ఎద్దేవా చేశారు. వేలాది టీచర్ పోస్టులు ఖాళీగా ఉండగా, తక్కువ పోస్టులకు డీఎస్సీ ప్రకటన ఇవ్వడం వెనుక ఉన్న మర్మం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ పోస్టులను కుదించేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో నిరుద్యోగ ఓటర్లను ఆకట్టుకోవడానికి ఈ మోసపూరిత డీఎస్సీ ప్రకటన ప్రకటించారని ఆయన విమర్శించారు. దగా డీఎస్సీ ప్రకటనకు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్న నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని గోవర్ధన రెడ్డి పేర్కొన్నారు.

ఘనంగా మెండలీఫ్ జయంతి


ఆవర్తన పట్టిక ఆకారంలో కూర్చొన్న విద్యార్థులు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 8: మండలంలోని టేకుమంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీరియాడిక్ టేబుల్ రూపకర్త, మూలకాలను శాస్త్రబద్ధంగా వర్గీకరణ చేసిన మెండలీఫ్ జయంతి కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆవర్తన పట్టిక ఆకారంలో కూర్చొని మెండలీఫ్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబోధ్ ఖాన్, ఉపాధ్యాయులు షంషీర్ ఖాన్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఓట్ల తొలగింపు ఫిర్యాదులపై చర్యలు తీసుకోండి


ఆర్డీవోకు వినతిపత్రం సమర్పిస్తున్న పుత్తూరు టీడీపీ నాయకులు

నగరి, ఫిబ్రవరి 8: వలస వెళ్లినవారు, వివాహమై వెళ్లిపోయిన వారి ఓట్ల తొలగింపుపై తాము ఇచ్చిన ఫిర్యాదులను పరిశీలించి చర్యలు తీసుకోవాలని నగరి ఆర్డీవో వెంకటరెడ్డికి పుత్తూరు టీడీపీ నాయకులు వినతిపత్రం సమర్పించారు. గురువారం ఆ పార్టీ బీసీసెల్ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఆర్డీవోను కలిసి పుత్తూరు మున్సిపాలిటీ, పోలింగ్ బూత్ నెంబర్ 41లో సుమారు 19 ఓట్లు తొలగించమని టీడీపీ తరఫున బీఎల్‌వో తేజస్విని అభ్యర్థించినట్లు చెప్పారు. ఇందుకు తగ్గ ఆధారాలు కూడా సమర్పించి చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. అయితే బీఎల్‌వో తేజస్విని అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతూ ఓట్ల తొలగింపు ఫిర్యాదులను బుట్టదాఖలు చేశారని ఆరోపించారు. దీనిపై ఆర్డీవో విచారణ జరిపి ఓట్ల తొలగింపు ఫిర్యాదుతో పాటు బీఎల్‌వో తేజస్వినిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. వినతిపత్రం సమర్పించిన వారిలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు గాలి జీవరత్నం నాయుడు, నాయకులు డీఎస్ గణేష్, యుగంధర్, ఆనంద్, ధనపాల్, రాధా అశోక్ తదితరులు ఉన్నారు.

పొరబాట్లకు ఆస్కారం లేకుండా ఎన్నికల నిర్వహణ

నగరి, ఫిబ్రవరి 8: ఎలాంటి పొరబాట్లకు ఆస్కారం లేకుండా ఎన్నికల విధులు నిర్వహించాలని ఆర్డీవో వెంకటరెడ్డి సూచించారు. గురువారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఎన్నికల నిర్వహణకు సంబంధించిన అంశాలపై నియోజకవర్గ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెక్టార్ అధికారులు వారి పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి కనీస వసతులపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పించాలన్నారు. మండల సర్వేయర్లు సెక్టార్ల వారీగా రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలన్నారు. కంప్యూటర్ ఆపరేటర్లు ఎన్నికల క్లెయిమ్స్‌కు సంబంధించి ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఎలాంటి తప్పులు లేకుండా ఎంట్రీ చేయాలని ఆదేశించారు.

బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవో...

అంతకుమునుపు నగరి నూతన ఆర్డీవోగా వెంకటరెడ్డి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. కర్నూలు జిల్లా డోన్ ఆర్డీవోగా ఉన్న ఆయన బదిలీపై నగరికి వచ్చారు.

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయండి

పాలసముద్రం, ఫిబ్రవరి 8: రానున్న ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాలు నిర్వహించే పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని ఎంపీడీవో రామనాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయడానికి జిల్లా అధికారులు వచ్చే సమయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రమేష్, ఏవో విద్యావతి, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శ్రీవరసిద్ధి వినాయక వైభవం
గ్రంథాన్ని ఆవిష్కరించిన సీఎం


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి జగన్

ఐరాల(కాణిపాకం), ఫిబ్రవరి 8: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి సంబంధించి శ్రీవరసిద్ధి వినాయక వైభవం.. ఉపాసన విధానం గ్రంథాన్ని గురువారం ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. విజయవాడలోని అమరావతిలోని సెక్రటేరియట్ కార్యాలయంలో ఈ గ్రంథాన్ని ఆవిష్కరించారు. రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈవో వెంకటేశు, గ్రంథ పరిశోధకుడు డాక్టర్ లక్ష్మీసీతారామాంజనేయశర్మ, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఆర్‌పీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా కృష్ణమూర్తి



బంగారుపాళ్యం, ఫిబ్రవరి 8: సమగ్ర శిక్ష క్లస్టర్ రీసోర్స్‌పర్సన్ (సీఆర్‌పీ) సంఘం జిల్లా అధ్యక్షుడిగా కృష్ణమూర్తిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం బంగారుపాళ్యంలో జరిగిన సమావేశంలో సీఆర్‌పీ సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా శరత్ బాబు, ప్రధానకార్యదర్శిగా తేజాకుమార్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా లతను ఎన్నుకున్నారు.

జీడీనెల్లూరు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వెంకటశివ

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 8: డిప్యూటీ కలెక్టర్ విధులతో పాటు గంగాధరనెల్లూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వెంకటశివ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన నంద్యాల జిల్లా నుంచి బదిలీపై చిత్తూరు జిల్లాకు వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన భవాని జిల్లాలోనే ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారిణిగా బదిలీ అయ్యారు.

11న కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ కార్యక్రమం

చిత్తూరు కల్చరల్, ఫిబ్రవరి 8: నగరంలోని బజారు వీధి వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈనెల 11న వాసవి మాత ఆత్మార్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్యసంఘం ప్రతినిధులు సకల వెంకటేశం గుప్తా, శ్రీకలెక్షన్ బద్రీనారాయణ, సకల మోహన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.